


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు

సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర **రాజముద్ర**

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 05.12.2025 | సంపుటి : 2 | సంచిక :301 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Friday | 05.12.2025 | volume : 2 | Issue : 301 | Pages : 8 | Cost : 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




5000 మంది.. 40 నిమిషాల

## 'ఆత్మాహుతి' శిక్షణ

- విస్తరిస్తున్న జైషే మహిళా బ్రిగేడ్
- జోరుగా మహిళల రిక్రూట్‌మెంట్
- 500లకే గంటపాటు శిక్షణ

10



## సుప్రీంలో రాహుల్ గాంధీకి ఊరట

- భారత ఆర్మీపై అనుచిత వ్యాఖ్యల కేసు
- ట్రయల్ కోర్టు చర్యలను నిలిపివేసిన సుప్రీం

10



02

## అదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు నిర్మించి

# పరిశ్రమలు రప్పిస్తాం

### ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న ఆదిలాబాద్‌కు ఎయిర్‌బస్ తీసుకొస్తా

ఆదిలాబాద్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వరాల జల్లు

యూనివర్సిటీ ఏర్పాటుకు తక్షణ హామీ

సిమెంట్ పరిశ్రమను తెరిపించి యువతకు ఉద్యోగాలు

రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన

ఆదిలాబాద్ పర్యటనలో సీఎం వెల్లడి

ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న ఆదిలాబాద్‌లో ఎయిర్ బస్‌ను దించి.. పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏడాది తిరిగేలోపు ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్‌లో ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

## ఫ్యూచర్ ఏఐదే.. ప్రపంచాన్ని శాసిస్తుంది

### గుర్తింపు కోసం నేను పనిచేయను

2047 నాటికి మూడు ట్రిలియన్ల ఎకానమీకి ప్లాన్

వేయికోట్ల రూపాయలతో స్టార్టప్ లను ప్రోత్సహిస్తాం

క్వాంటం టెక్నాలజీ'లో తెలంగాణను గ్లోబల్ లీడర్

నీతి ఆయోగ్ క్వాంటం సదస్సులో భట్టి, శ్రీధర్ బాబు





హైదరాబాద్,డిసెంబరు4: రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ ప్రపంచాన్ని శాసిస్తుందని డిప్యూటీ సీఎం విక్రమార్క పేర్కొన్నారు. అయితే, తెలంగాణ 2047 నాటికి మూడు ట్రిలియన్ల ఎకానమికి చేరుకోవాలని ప్లాన్ చేస్తున్నాం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లో

-మిగతా 2 లో..

## పుతిన్‌కు మోదీ స్వాగతం

న్యూఢిల్లీ : రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌కు చేరుకున్నారు. ఢిల్లీ సమీపంలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో దిగిన ఆయనకు ప్రధాని మోదీ స్వయంగా స్వాగతం పలికారు. నాలుగేళ్ల అనంతరం ఆయన

-మిగతా 2 లో..



## రూపాయి మరింత పతనం

రూ.90.36 వద్ద ప్రారంభమై, 90.43కు చేరిక

అంతర్జాతీయ పరిణామాల ప్రభావం

10

అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి పతనం కొనసాగుతూనే ఉంది. భారత్-అమెరికా డీల్‌పై అనిశ్చితులు, విదేశీ పెట్టుబడులు తరలిపోవడం వంటి కారణాలతో రూపాయి మారకం విలువ నానాటికీ క్షీణిస్తోంది. గురువారం నాటి ట్రేడింగ్‌లో ఒక దశలో డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ విలువ ఏకంగా 28 పైసలు పడిపోయి 90.43 వద్ద సరికొత్త జీవనకాల కనిష్ఠానికి పడిపోయింది.





## బిఆర్ఎస్ సెంటిమెంట్ రాజకీయాలు ఆపాలి

రోశయ్య, బాలసుబ్రమణ్యం ఒక ప్రాంతం వారు కాదు

రోశయ్య వర్ధంతి సభలో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్

హైదరాబాద్,డిసెంబర్ 3 : తెలంగాణ సెంటిమెంట్‌తో భారత రాష్ట్ర సమితి రాజకీయ లబ్ది పొందే ప్రయత్నం చేస్తోందని టీపీసీసీ

-మిగతా 2 లో..



## ఢిల్లీలో క్షీణిస్తున్న గాలి నాణ్యత

పిల్లలు చనిపోతున్నారు

సోనియా గాంధీ ఆందోళన

దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకి క్షీణిస్తుంది. దీనిపై తాజాగా కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ ఆందోళన వ్యక్తంచేశారు. వాయు కాలుష్యం అరికట్టేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## భూ కుంభకోణానికి కుట్ర

### పారిశ్రామికవేత్తలకు భూములు కట్టబెట్టే కుట్రలు

బిఆర్ఎస్ రాగానే ఈ పాలసీని రద్దు చేస్తాం

ఎవరైనా పెట్టుబడి పెడితే నష్టపోక తప్పదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

02

జీడిమెట్ల పారిశ్రామిక కారిడార్‌ను సందర్శించిన కేటీఆర్






## సైబర్ నేరగాళ్ల షాక్

పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్లు హ్యాక్

02

సైబర్ నేరగాళ్ల షాక్

పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్లు హ్యాక్

## ఛత్తీస్‌ఘడ్‌లో ఎన్‌కౌంటర్

### 18 మంది మావోయిస్టులు మృతి: ఐజీ సుందర్‌రాజ్

ఛత్తీస్‌గఢ్ : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపుర్-దంతెవాడ సరిహద్దు అడవుల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భీకర ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో 9 మంది మహిళలతో సహా మొత్తం 18 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. బీజాపూర్‌లో డీఐజీ కమలోచన్ కశ్యప్, ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్‌తో కలిసి ఎన్‌కౌంటర్ వివరాలను గురువారం

-మిగతా 2 లో..



## భారీగా అక్రమాస్తులు

### ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్ అరెస్ట్

హైదరాబాద్: అక్రమాస్తుల కేసులో రంగారెడ్డి జిల్లా ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఏడీ శ్రీనివాస్ నివాసం, బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు తెలంగాణ, ఏపీ, కర్ణాటకల్లో భారీగా ఆస్తులు ఉన్నట్టు గుర్తించారు. మొత్తం ఆరు ప్రాంతాల్లో సోదాలు చేసిన అధికారులు.. రాయదుర్గం మైహెూంభుజలో ఫ్లాట్, కర్ణాటకలో 11 ఎకరాల వ్యవసాయ భూమి, అనంతపురంలో 11 ఎకరాలు, మహబూబ్‌నగర్‌లో నాలుగు ప్లాట్లు, నారాయణపేటలో రైస్ మిల్లు, 3 ప్లాట్లు ఉన్నట్టు అధికారులు తెలిపారు. సోదాల్లో రూ.5లక్షల నగదు, 1.6 కిలోల బంగారం, 770 గ్రాముల వెండి, 2 కార్లు, పలు పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.





# గుర్తింపు కోసం నేను పనిచేయను..

(మొదటిపేజీ తరువాయి)

చర్చిస్తుంది.. దాని ఆవిష్కరణకి తెలంగాణను ఎంచుకున్నందుకు నీతి ఆయోగ్ కి ధన్యవాదాలు చెప్పుకొచ్చారు. డిజిటల్, టాలెంట్ కి హైదరాబాద్ కి కేంద్రంగా మారింది అన్నారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా టెక్నాలజీని ప్రమోట్ చేసే పనిలో ఉన్నారు.. నీతి ఆయోగ్ కూడా గ్లోబల్ సమ్మిట్ లో భాగస్వామ్యం కావాలని కోరుతున్నాం.. ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అన్ని రంగాల పెట్టుబడులు ఆహ్వానిస్తున్నాం.. యంగ్ ఇండియా స్టార్టప్ కోసం ఫండింగ్ చేయాలని నిర్ణయించాం.. 1000 కోట్ల రూపాయలతో స్టార్టప్ లను ప్రోత్సహిస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు. 'క్వాంటం సిటీ'గా హైదరాబాద్ ను తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'క్వాంటం టెక్నాలజీ'లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా నిపుణులు, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశంలోనే తొలిసారిగా 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీని రూపొందించా మన్నారు. గచ్చిబౌలిలోని 'ఐఐఐటీ హైదరాబాద్'లో 'నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం అండ్ తెలంగాణ క్వాంటం స్ట్రాటజీని గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అప్పట్లో విద్యుత్, ఇంటర్నెట్ లాంటి ఆవిష్కరణలు ప్రపంచం రూపురేఖలు మార్చాయన్నారు. అదే తరహాలో రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీ కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతుందన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీలో భాగంగా రీసెర్చ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ, లైఫ్ సైన్సెస్ యాక్సిలరేషన్, టాలెంట్ పైప్‌లైన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కమ్యూనికేషన్, క్వాంటం కంప్యూటింగ్‌లో ఆర్అండ్ డీ, ఇన్నోవేషన్స్ ను ప్రోత్సహించేలా రూపొందించిన ఈ పాలసీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందన్నారు. ఇది కేవలం తమ ప్రభుత్వం రూపొందించిన ఒక పాలసీ మాత్రమే కాదని, క్వాంటం టెక్నాలజీలో దేశానికి దిశా నిర్దేశర చేసే 'డైరెక్షన్' అని అన్నారు. ఈ టెక్నాలజీ లో దేశానికి ఒక బెంచ్ మార్క్ సెట్ చేసేలా ప్రత్యేకంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్'కు కూడా శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి స్టార్టప్స్, కొత్త ఆలోచనలకు భరోసానిచ్చేలా 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్'ను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. 'ఇండస్ట్రీ డే' పేరిట ప్రతి వారంలో ఒకరోజు అధికారులు, ప్రతి నెలలో ఒక రోజు సంబంధిత మంత్రి పారిశ్రామిక వేత్తలతో ప్రత్యేకంగా సమావేశమవుతారన్నారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కార మార్గాలు, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారన్నారు.



# రోశయ్య, బాలసుబ్రమణ్యం ఒక ప్రాంతం వారు కాదు

(మొదటిపేజీ తరువాయి)

చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఒక ప్రాంతానికి చెందిన వారు కాదని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నగరంలోని రవీంద్ర భారతిలో ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభలో మహేష్ గౌడ్ పాల్గొని ప్రసంగించారు. బాలసుబ్రహ్మణ్యం విగ్రహం రవీంద్ర భారతిలో పెడితే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. సెంటిమెంట్ రగల్చి బీఆర్ఎస్ లబ్ది పొందే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దేవుళ్ల విషయంలో సీఎం ఒక సామెతగా చెప్పారని.. దాన్ని రాజకీయం చేయడం తగదన్నారు. బీఆర్ఎస్ కోసమే కిషన్ రెడ్డి పనిచేస్తున్నారని ఆరోపించారు. హిల్ట్ పాలసీ ద్వారా హైదరాబాద్‌లో సామాన్యులకు భూముల ధరలు అందుబాటులో వస్తాయని మహేష్ గౌడ్ వెల్లడించారు. కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్ మారుతుందని తెలిపారు. అవినీతికి అలవాటు పడ్డ కేసీఆర్ కుటుంబం.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా అవినీతి అని ఆరోపణలు చేయడం అలవాటుగా మారిందని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ విమర్శించారు. ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభను రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ దయానంద్, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, జగ్గారెడ్డి, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల్ శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. రోశయ్య వర్ధంతి సందర్భంగా వి.హనుమంతరావును రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ సత్కరించింది. అలాగే రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పేద విద్యార్థులకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ స్కాలర్ షిప్‌లు అందజేశారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు. ఎన్‌కౌంటర్ నుంచి ప్రాణాలతో బయటపడిన మావోయిస్టులు త్వరగా లొంగిపోతే మంచిదని, లేకుంటే ప్రాణాలు పోగొట్టుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. కాల్పుల్లో మృతి చెందిన వారిపై రూ.1.3 కోట్ల రివార్డు ఉందని చెప్పారు. మృతుల్లో మావోయిస్టు పీఎల్జీ రెండో బెటాలియన్ కమాండర్ వెల్ల మోడియంతో పాటు కంపెనీ నెంబర్ 2, 7లకు చెందిన కీలక మావోయిస్టులు.. రైను ఓఎం, సన్ను అవలం, నందా మీడియం, లాలు, రాజు పూణెం, రమేష్ కవాసి, లక్ష్మీ తాటి, బండి, మద్వి, సుకీ లేఖం, సోమ్డి కుంజం, చందు కుర్మం, మాసే, రీనా మార్కం, సోనీ మద్వి, సంగీత పద్దంగా గుర్తించామన్నారు. మరో ఇద్దరిని గుర్తించాల్సి ఉందని తెలిపారు. బస్తర్ పరిధిలో గత 19 నెలల్లో వివిధ ఎన్‌కౌంటర్లలో 469 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు ఐజీ వివరించారు. మావోయిస్టులు లొంగిపోకుంటే భద్రతా దళాలను ఎదురుకోవాల్సి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించారు.

# అదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు నిర్మించి పరిశ్రమలు రప్పిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఉండాల్సిందేనని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇక్కడ ఎయిర్‌పోర్టు వస్తే ఆదిలాబాద్‌కు పరిశ్రమలు వస్తాయని పేర్కొన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. ఎర్రబస్సే కాదని.. ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్సు కూడా తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. ఆదిలాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. అనంతరం ప్రసంగించారు. ఆదిలాబాద్ అభివృద్ధి బాధ్యత నేనే తీసుకుంటానని చెప్పుకొచ్చారు. ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న ఆదిలాబాద్‌లో ఎయిర్ బస్‌ను దించి.. పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏడాది తిరిగేలోపు ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్‌లో ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. రెండేళ్ల క్రితం ఓటును ఆయుధంగా మార్చి నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపారు. ప్రజలు తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంటోంది. సంక్షేమం-అభివృద్ధి రెండుకళ్లుగా భావిస్తూ ముందుకెళ్తున్నాం. రెండేళ్లుగా ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నా. చిన్న వయసులోనే నాకు గొప్ప అవకాశం దక్కడం.. ప్రజల దీవెన, దేవుడి సంకల్పం. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాజకీయాలకతీతంగా కృషి చేస్తున్నాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు విపక్ష ఎమ్మెల్యేలను ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా అనుమతించలేదు. ఎమ్మెల్యేలను కూడా సచివాలయంలోకి రాకుండా అడ్డుకున్న ప్రభుత్వాన్ని గత పదేళ్లలో చూశాం. ఏ ఆశయంతో సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారో.. గత పదేళ్లలో అది నెరవేరలేదు. రాష్ట్ర అభివృద్ధికి తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంటరీ రూపొందించాం. పెట్టుబడులు సాధించే లక్ష్యంతో ఈనెల 8, 9న గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం అని అన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంద్రవెల్లి స్ఫూర్తిగానే గత ప్రభుత్వంపై నేను పోరాటం ప్రారంభించానని అన్నారు. అధికారంలోకి రాగానే ఇంద్రవెల్లి అమరుల స్థూపం పర్యాటకంగా అభివృద్ధి చేసే దస్త్రంపై సంతకం



పెట్టాను. ఆదిలాబాద్‌కు సాగునీరు అందేలా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును వైఎస్ఆర్ చేపట్టారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. మూడేళ్లకే కాళేశ్వరం కూలింది. ప్రజల సొమ్ము దోచుకుని అక్రమ సొమ్ము కోసం ఇవాళ ఆ కుటుంబంలో గొడవలు పడుతున్నారు. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్దే నిర్మించి ఆదిలాబాద్‌కు నీరు ఇస్తాం. ఎన్నికల ఉత్సవం పూర్తి కాగానే మరో 40వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం అని సీఎం హామీ ఇచ్చారు.తమ్మిడిహట్టి దగ్గర ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కట్టితీరుతామని స్పష్టం చేశారు.ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి తానే వస్తానని తెలిపారు. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గనులు ఉన్నాయని వివరించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇంద్రవెల్లిని పర్యాటక కేంద్రంగా మారుస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే ఆదిలాబాద్‌కు మళ్లీ వస్తానని.... రోజంతా సమస్యలపై సమీక్షిస్తానని తెలిపారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్, కమ్యూనికేషన్‌లో ఆదిలాబాద్ అభివృద్ధి చెందుతోందని వివరించారు. ఆదిలాబాద్‌లో తప్పకుండా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. వర్సిటీ ఎక్కడ కట్టాలో స్థానిక నేతలంతా కలిసి ఒక నిర్ణయానికి రావాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇంద్రవెల్లిలో యూనివర్సిటీ కడితే బాగుంటుందని తన భావన అని తెలిపారు. అనుమతి మాత్రమే తనదని.. ఎక్కడ కట్టాలో నిర్ణయం మీదేనని చెప్పుకొచ్చారు. ఏడాదిలో 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. రాబోయే రోజుల్లో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. మన యువత ఐఏఎస్, ఐపీఎస్‌లు అయినప్పుడే తనకు సంతోషమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బాగా చదువుకుని తెలంగాణ ఖ్యాతిని దశదిశలా చాటాలన్నారు. సర్పంచ్‌లను చూసి ఎన్నుకోవాలని, పనిచేసే వారికే అవకాశం ఇవ్వాలన్నారు. రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, తదితరులు సభలో పాల్గొన్నారు.

# హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ భారీ భూ కుంభకోణం

**హైదరాబాద్, డిసెంబర్ 3 :** బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఈ పాలసీది రద్దు చేస్తామని, అవసరమైతే దీనికోసం ఒక చట్టాన్ని తీసుకువస్తామని వెల్లడించారు. రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే అటు పారిశ్రామిక భూములతో పాటు డబ్బులు కూడా పోతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.పరిశ్రమలు వద్దు అంటూ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్సులు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నదని ధ్వజమెత్తారు. పారిశ్రామిక భూముల బదలాయింపుపై కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నిజనిర్ధారణ బృందం జీడిమెట్ల ఇండస్ట్రియల్ పార్క్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా హమాలీలతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేటు వ్యక్తుల భూములు కావని, ప్రైవేట్ వ్యక్తులకు ప్రజలు, ప్రభుత్వం ఇచ్చిన భూములన్నారు. అందులో కేవలం పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలన్న నిబంధనలతోనే ఆ భూములను ఇచ్చారని గుర్తుచేశారు. మార్కెట్‌లో గజం ధర లక్షన్నర రూపాయలు పలుకుతుంటే ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కు ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్తున్నదని విమర్శించారు. హైదరాబాద్ నగరంలో ఇండ్లకు, పాఠశాలలు, దవాఖానలు, చివరికి స్మశానాలకు స్థలం లేదు.. కానీ ప్రైవేట్ వ్యక్తులకు 9300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటున్నదని మండిపడ్డారు. ఈ 9300 ఎకరాల భూములను తిరిగి వెనక్కి తీసుకొని అక్కడ కాంగ్రెస్ చెప్తున్న ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కూళ్లు, హాస్పిటళ్లు కట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో స్థలం లేదని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటిదాకా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కట్టలేదన్నారు. ఇక్కడ ఉన్న కంపెనీలు తరలి వెళ్తే హైదరాబాద్ నగరంలో వాటిపైన ఆధారపడిన లక్షల మంది ఉపాధి పోతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకు వివరించేందుకే పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్న భూముల ధర నిర్ధారణ, దాని వెనుక ఉన్న అసలు నిజాలు నిర్ధారణ జరగాలన్న ఉద్దేశంతోనే ఈ పర్యటనలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ ఇక్కడితో వదిలిపెట్టదని, కాంగ్రెస్ పార్టీ హిల్ట్ పాలసీ కుంభకోణంపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలోని కాలనీల ప్రజలకు ఈ అంశాన్ని వివరిస్తామని తెలిపారు. రౌండ్ టేబుల్



సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ముందుకు పోతామని చెప్పారు. అనుముల రేవంత్ రెడ్డి కాదని, అవినీతి అనకొండ అని విమర్శించారు. 9300 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేసి లక్షల కోట్ల రూపాయలు దోచుకొని ఢిల్లీకి మూటలు పంపడానికి చేస్తున్న ఈ స్కామ్ ను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. హిల్ట్ పాలసీని వెనక్కి తీసుకొని లక్షల కోట్ల విలువచేసే ప్రజల భూమిని కాపాడే దాకా తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని చెప్పారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఇంతటి భారీ కుంభకోణాన్ని, దోపిడీని చూసి తట్టుకోలేక తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న తెలంగాణ బిడ్డ మాకు సమాచారం ఇచ్చారని వెల్లడించారు. ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై తాము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, సమాచారం లీక్ అయిందంటూ ప్రభుత్వం బాధపడుతున్నదని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే తమ ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీడిమెట్ల ప్రాంతంలో గజానికి మార్కెట్ ధర లక్ష రూపాయలుగా ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కే భూమిని పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడతామని చెబుతున్నదని విమర్శించారు. ఇది కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుంభకోణానికి ఇది నిదర్శనమన్నారు. భూముల దోపిడీ ఆర్నెళ్లుగా జరుగుతున్నదని, పాలసీ ఇప్పుడు బయటకు వచ్చిందని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న భూదోపిడీని కార్మిక సంఘాలు అడ్డుకోవలన్నారు.

# పంచాయితీ రిజర్వేషన్లపై జోక్యం చేసుకోం

## పిటిషన్లపై విచారణలో హైకోర్టు స్పష్టీకరణ

**హైదరాబాద్, డిసెంబరు 4 :** పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో జోక్యం చేసుకోలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. చట్టప్రకారం ఎన్నికల పక్రియలో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్‌ల వ్యవహారంలో దాఖలైన ఆరు పిటిషన్‌లపై విచారించిన హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ఎస్సీ, ఎస్టీ జనాభా లేని చోట కూడా ఆయా కులాలకు వార్డుమెంబర్లు, సర్పంచి రిజర్వేషన్లు కేటాయించారన్న పిటిషనర్లు కోర్టు దృష్టికి తెచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సర్పంచి రిజర్వేషన్లు కేటాయించడం వల్ల తప్పులు దొర్లాయని తెలిపారు. రిజర్వేషన్లు కేటాయించిన చోట సంబంధిత కులానికి చెందిన వ్యక్తులు లేకపోతే ఎన్నికల నిర్వహించబోమని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. ఎస్ఈసీ వాదనను రికార్డు చేసుకున్న హైకోర్టు.. పిటిషన్లపై విచారణ ముగించింది.




# భారత్‌కు చేరుకున్న పుతిన్..

(మొదటిపేజీ తరువాయి)

దిల్లీకి వచ్చారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రావడం ఇదే మొదటిసారి. ఇండియా-రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర భేటీలో భాగంగా మోదీతో సమావేశం కానున్నారు. భారత్‌తో సంబంధాలు, సహకారాన్ని మరింత పెంపొందించుకోవడానికి రష్యా ఎదురుచూస్తోందని పుతిన్ ఇప్పటికే పేర్కొన్నారు. ఇంధనం, పరిశ్రమలు, అంతరిక్షం, వ్యవసాయం తదితర రంగాల్లో అనేక ఉమ్మడి ప్రాజెక్టులు పూర్తి చేసుకోవడమే లక్ష్యంగా ఇరుదేశాలు చర్యలు తీసుకుం టున్నట్లు తెలిపారు. భారత్ నుంచి దిగుమతులు మరింత పెంచుకునే అంశం పైనా చర్చలు జరపనున్నట్లు వెల్లడించారు.

# సైబర్ నేరగాళ్ల షాక్

**హైదరాబాద్, డిసెంబర్ 3 :** తెలంగాణ పోలీసులకు సైబర్ నేరగాళ్లు షాకిచ్చారు. ఇటీవలే హైకోర్టు వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసిన సైబర్ క్రిమినల్స్.. తాజాగా రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్లను పనిచేయకుండా చేశారు. దీంతో గద పది రోజులుగా రెండు కమిషనరేట్ల వెబ్‌సైట్లు పూర్తిగా నిలిచిపోయాయి. వీటిలోకి మాల్‌వేర్ చొరబడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వెబ్‌సైట్లను క్లిక్ చేస్తే అధికారిక సమాచారానికి బదులుగా గేమింగ్ సైట్లకు రీడైరెక్ట్ అవుతున్నట్లు గుర్తించారు. దీంతో సర్వర్లను డౌన్ చేసి వాటిని నిర్వహిస్తున్న ఎన్ఐసీకి సమాచారం అందించారు. సమస్యను పరిష్కరించేందుకు రెండు కమిషనరేట్లలోని ఐటీ బృందాలు యత్నిస్తున్నాయి. వెబ్‌సైట్ల పునరుద్ధరణకు ఎన్ఐసీ పర్యవేక్షణలో ప్రతినిధులు పనిచేస్తున్నారు. రెండు కమిషనరేట్ల పోలీస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నారు. మళ్లీ హ్యాకింగ్ కాకుండా అధునాతన వాల్స్ ఆడిట్ చేస్తున్నారు. ఆడిహ్యాకింగ్‌కు కారణమైన ముఠాలను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులతో సమన్వయం చేస్తూ సర్వర్‌ల భద్రతను బలోపేతం చేసే పనిలో నిమగ్నమయ్యారు. కాగా, ఇదే తరహాలో పలు ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లు కూడా హ్యాక్ అయినట్లు సమాచారం. ఇప్పటికే డార్క్ వెబ్‌లో 22 వెబ్‌సైట్లకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉందని సైబర్ నిపులు చెబుతున్నారు.

# సర్పంచ్ పదవి కోసం ఒకే కుటుంబం నుంచి ముగ్గురు పోటీ

**జగిత్యాల, డిసెంబరు 4 :** తెలంగాణలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చిత్ర, విచిత్ర సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఓ గ్రామంలో సర్పంచ్ బరిలో తల్లి, కూతుర్లు పోటీ చేస్తుండగా మరో చోట అన్నా, చెలెలు పోటీ చేస్తుండడంతో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు మరింత రసవత్తరంగా మారుతున్నాయి. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం తిమ్మయపల్లిలో తల్లి, కూతురు పోటీ చేస్తుండగా గుమ్లాపూర్ లో సొంత అన్నా, చె÷-లలెలు సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచారు. అయితే, సర్పంచ్ ఎస్సీ జనరల్ కు ముగ్గురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు బరిలో నిలబడ్డారు. తెడ్డు శివకుమార్ తో పాటు సొంత చెల్లెలు రౌట్ల స్రవంతి, స్రవంతి పెద్ద నాన్న కుమారుడు తెడ్డు రమేష్ నామినేషన్ దాఖలు చేశారు. ఇక, సర్పంచ్ స్థానానికి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పోటీ చేస్తుండగా సర్పంచ్ పదవి ఎవరిని వరించబోతుందని జిల్లా ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. కాగా, రౌట్ల స్రవంతికి బీఆర్ఎస్ పార్టీ మద్దతు పలుకుతుండగా ఆమె అన్న తెడ్డు శివకుమార్ స్వతంత్ర అభ్యర్థిగా, పెద్ద నాన్న కుమారుడు తెడ్డు రమేష్ కు కాంగ్రెస్ పార్టీ మద్దతు పలుకుతున్నట్లు తెలిపారు.

# పర్యాటక కేంద్రంగా ఉమ్మడి జిల్లా అభివృద్ధి

- తద్వారా స్థానికుకలు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు
- ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి
- ఆదిలాబాద్ పర్యనటనలో మంత్రి జూపల్లి కృష్ణారావు



**ఆదిలాబాద్, డిసెంబరు 4 :** మినీ కాశ్మీర్ గా పేరొందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. తద్వారా స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. పేదలు కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. గతంలో పాలించిన కేసీఆర్ పుణ్యమా అని ధనిక రాష్ట్రం అప్పుల కుప్పగా తయారైందన్నారు. రూ. 8 లక్షల కోట్ల రూపాయల అప్పుల చేస్తే.. దానికి ప్రతీ నెల ప్రజా ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తుంది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ రెండేళ్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని అన్నారు.. ఇవాళ ఆదిలాబాద్ లో రూ. 260.45 కోట్లతో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఆదిలాబాద్ లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ కు పునాదిరాయి వేసుకున్నాం అని జూపల్లి వివరించారు. ఆదిలాబాద్ లో ఏయిర్ పోర్టు ఏర్పాటుకు 700 ఎకరాల భూసేకరణ కోసం సీయం ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా 61 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం. రానున్న రోజుల్లో మరో 40 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. చనాక- కొరాట బ్యారేజ్ నిర్మాణాన్ని పూర్తి చేయడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పదేండ్లలో ఒక ఎకరానికి కూడా సాగునీరు ఇవ్వలేకపోయింది. చనాక -కొరాట బ్యారేజ్ పెండింగ్ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని హామీనిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు పంటనష్టం ఇవ్వలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల పంటనష్టం ఇస్తుంది. మిగిలిన రైతులకు నివేదిక ఆధారంగా పంటనష్టం చెల్లిస్తాం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏం చేయొచ్చో.. రెండేళ్లలో చేసి చూపించాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు, సబ్సిడీ గ్యాస్ ? నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, రైతులకు రూ.21 వేల కోట్లకు పైగా రుణమాఫీ, సన్నాలకు రూ. 500 బోనస్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. బలమైన ఆర్థిక రాష్ట్రంగా నిలదొక్కుకోవడానికి, ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి తెలంగాణ రైజింగ్ ? 2047 విజన్ డాక్యుమెంట్ ను ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రపంచ స్థాయిలో రాష్ట్రం అగ్రగామిగా ఉండేందుకు లక్ష్యాలను నిర్దేశిరచనున్నాం. క్రీడలు, పర్యాటకం, వాణిజ్యం, పరిశ్రమలు, ప్రకృతి వ్యవసాయం ఇవన్నీ కూడా రాష్ట్ర పాలసీలో భాగంగా ముందుకెళ్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

## పాతబస్తీలో యువకుడి దారుణ హత్య

### రియల్ వ్యాపారి జునైద్‌గా గుర్తింపు

**హైదరాబాద్, డిసెంబరు 4 :** హైదరాబాద్ నగరంలోని పాతబస్తీలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. రెయిన్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి కత్తి పోట్లతో పడి ఉన్నట్లు పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు బాధితుడిని హుటాహుటిన సంతోష్‌నగర్ లోని యశోదా ఆస్పత్రికి తరలించారు. అయితే తీవ్రంగా గాయపడిన సదరు వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు పాతబస్తీ రెయిన్ బజార్ కు చెందిన మహమ్మద్ జునైద్ (30)గా గుర్తించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన జునైద్‌ను కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు విచక్షణారహితంగా కత్తులతో పొడిచారని.. తీవ్రంగా గాయపడిన జువైద్ ను ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. అనంతరం జునైద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ హత్యకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు విచారణ మొదలుపెట్టారు. హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. అయితే నిందితులు, బాధితుడు ఇద్దరూ కూడా బంధువులే అని అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్ సుందర్ తెలిపారు. జువైద్‌ను ఎందుకు హత్య చేశారనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ వెల్లడించారు.





## 'యాసిడ్' కేసుల నిర్లక్ష్యంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం

**న్యూఢిల్లీ, డిసెంబరు 4 :** దేశ వ్యాప్తంగా యాసిడ్ దాడి కేసుల విచారణలో జరుగుతున్న సుదీర్ఘ జాప్యంపై సుప్రీంకోర్టు గురువారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీ కోర్టులో 16 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఒక కేసును 'జాతీయ అవమానం'గా ధర్మాసనం అభివర్ణించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం.. దేశవ్యాప్తంగా అన్ని హైకోర్టులలో పెండింగలో ఉన్న యాసిడ్ దాడి కేసులను నాలుగు వారాల్లోగా విచారణ జరిపి, వివరాలను తమకు సమర్పించాలని ఆదేశించింది. యాసిడ్ దాడి బాధితురాలు షహీన్ మాలిక్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. రోహిణి కోర్టులో 2009 నుండి పెండింగ్‌లో ఉన్న బాధితురాలి కేసులో పదేపదే జరుగుతున్న ఆలస్యంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై మాలిక్ తన కేసు ఎందుకు ఇంకా ముగియలేదో వివరిస్తూ, ఒక దరఖాస్తును దాఖలు చేయాలని కోర్టు కోరింది. అవసరమైతే కోర్టు స్వయంగా విచారణను కూడా చేపట్టవచ్చని కూడా సూచించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా దీనిపై స్పందిస్తూ, ఈ తరహా కేసులను త్వరగా పరిష్కరిస్తామని, నేరస్థులు చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. తక్షణ న్యాయం అందించేందుకు, యాసిడ్ దాడి కేసులను ప్రత్యేక కోర్టులు విచారించడం ఉత్తమమని ప్రధాన న్యాయమూర్తి కాంత్ సూచించారు. అంతేకాకుండా యాసిడ్ దాడి బాధితులను వైకల్యం ఉన్న వ్యక్తులుగా వర్గీకరించాలని, వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు వీలు కల్పించాలని మాలిక్ చేసిన విజ్ఞప్తిపై స్పందించాలని కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. నిరంతర వైద్య సంరక్షణలో ఉంటూ, బాధితులు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఇబ్బందులను మాలిక్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులు దుర్మరణం




**గుంటూరు:** పల్నాడు జిల్లాలో గురువారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నాదెండ్ల మండలం గణపవరం వద్ద బైపాస్ రోడ్డుపై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురు విద్యార్థులు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అందరూ అయ్యప్పమాల ధారణలో ఉన్నారు. మృతులను విజ్ఞాన్ కాలేజీ విద్యార్థులుగా గుర్తించారు. పల్నాడు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ఏపీ మంత్రులు గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థుల మృతి తీవ్రంగా కలచి వేసిందని విచారం వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థులు ప్రమాదాల బారినపడటం అత్యంత బాధాకరమన్నారు. ప్రయాణ సమయంలో తొందరపాటు తగదని, కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు

## తీన్మార్ మల్లన్న ఆఫీసు ముందు నిప్పంటించుకున్న యువకుడు

### పరిస్థితి విషమం

**హైదరాబాద్:** బీసీలకు 42 శాతం కోటాను అమలు చేయకుండా అన్యాయం చేస్తున్నారంటూ ఒక యువకుడు నిప్పంటించుకున్న వైనం కలకలం రేపింది. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆఫీసు ముందు ఈ ఘటన చోటు చేసుకుంది. ఈరోజు (గురువారం) సాయంత్రం సాయి అనే యువకుడు తీన్మార్ మల్లన్న ఆఫీస్ కి వచ్చి తెలంగాణ రాష్టంలో బీసీలకు అన్ని ప్రధాన పార్టీలు అన్యాయం చేస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వకుండా మోసం చేస్తుందని దీనిపై పోరాటం చేయాలని తీన్మార్ మల్లన్న నీ కలిసేందుకు వచ్చానని చెప్పాడు. అయితే మల్లన్న ఆఫీసులో లేరని రేపు ఉదయం రావాలని చెప్పి పంపించారు అక్కడి సిబ్బంది. అక్కడి నుండి కిందకి వచ్చిన ఆయన కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. దీన్ని గమనించిన స్థానికులు ఫైర్ ఇంజన్‌కు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మంటలను ఆర్పి ఆ యువకున్ని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.

## ఐ బొమ్మ రవి పిటిషన్లపై ముగిసిన వాదనలు

**హైదరాబాద్:** ఐ-బొమ్మ నిర్వాహకుడు ఇమంది రవి కస్టడీ పిటిషన్లపై కౌంటర్ దాఖలుచేసిన అతని తరఫు న్యాయవాదులు నాంపల్లి కోర్టులో వాదనలు వినిపించారు. ఇప్పటికే ఒక కేసులో రవిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు 8 రోజుల పాటు విచారించారని కోర్టుకు తెలిపారు. ఒకే రకమైన కేసులో మళ్లీ కస్టడీ కోరతున్నారని, నిందితుడికి బెయిల్ రాకుండా పోలీసులు చూస్తున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. తండేల్, కుబేర సినిమాల పైరసీ కేసులకు సంబంధించి మరింత సమాచారం సేకరించాలని పోలీసులు తెలిపారు. ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం తీర్పు రేపటికి వాయిదా వేసింది. మరోవైపు రవి బెయిల్ పిటిషన్లపైనా వాదనలు ముగియడంతో తీర్పు రేపటికి వాయిదా పడింది.

## సుష్మాస్వరాజ్ భర్త కౌశల్ కన్నుమూత



**న్యూఢిల్లీ, డిసెంబరు 4 :** దివంగత సుష్మ స్వరాజ్ భర్త స్వరాజ్ కౌశల్ కన్ను మూ శారు. మిజోరం మాజీ గవర్నర్, భాజపా దివంగత నేత సుష్మా స్వరాజ్ భర్త స్వరాజ్ కౌశల్ (73).. అనారోగ్య కారణాలతో ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమార్తె బన్సూరీ స్వరాజ్ వెల్లడించారు. 1952 జులై 12న హిమాచల్ ప్రదేశ్‌లోని సోలన్‌లో జన్మించిన స్వరాజ్ కౌశల్.. 37 ఏళ్ల వయసులోనే (1990లో) మిజోరం గవర్నర్‌గా నియమితులయ్యారు. ఆయన భార్య సుష్మా స్వరాజ్.. ఢిల్లీ ముఖ్యమంత్రిగా, భారత విదేశాంగమంత్రిగా సేవలందించారు. 2019 ఆగస్టు 6న ఆమె మరణించారు.


## ప్రతి మూడు ఇండిగో విమానాల్లో రెండు ఆలస్యం



**న్యూఢిల్లీ:** దేశంలోని కీలకమైన విమానయాన సంస్థ ఇండిగో సేవల్లో తీవ్ర అంతరాయం కొనసాగుతోంది. ఈ సంస్థకు చెందిన ప్రతి మూడు విమానాల్లో రెండు ఆలస్యంగా నడుస్తున్నాయి. గత రెండు రోజుల్లోనే ఈ సంస్థకు చెందిన దాదాపు 300కు పైగా విమానాలు రద్దు కావడం గమనార్హం. పౌర విమానయాన మంత్రిత్వశాఖ లెక్కల ప్రకారం.. ఇండిగో రోజుకు మొత్తం 2,200 విమానాలను నడుపుతోంది. వీటిల్లో డిసెంబరు 2న కేవలం 35% మాత్రమే సరైన సమయానికి నడిచాయి. ఇక అదేరోజు ఇండిగో కంటే మెరుగ్గా ప్రభుత్వ అధీనంలోని అలయన్స్ ఎయిర్ సంస్థ విమానాలే 38% సరైన సమయానికి ప్రయాణించాయి. ఇటీవల ఇండిగోకు సంబంధించిన విమానాలు రద్దు అవడం, లేదా ఆలస్యం కావడం ఎక్కువయ్యాయి. వీటిలో ఢిల్లీ- ముంబయి, ఢిల్లీ- బెంగళూరు, ముంబయి- బెంగళూరు వంటి కీలక మార్గాల్లో ప్రయాణించేవే ఎక్కువగా ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. చిన్నచిన్న సాంకేతిక సమస్యలు, ప్రతికూల వాతావరణం, విమానాశ్రయాల్లో రద్దీతో పాటు సిబ్బంది కొరత వల్ల ఇలా జరుగుతుందని విమానయాన సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీ ఎయిర్‌పోర్టులోనే దేశీయ, అంతర్జాతీయంగా నడిచే 38 ఇండిగో విమానాలు రద్దయ్యాయని అధికారులు తెలిపారు. ముంబయి విమానాశ్రయంలో కూడా దాదాపు 33 విమానాలది ఇదే పరిస్థితి అని వెల్లడించారు. మొత్తంగా గత రెండు రోజుల్లో దేశవ్యాప్తంగా 300కు పైగా విమానాలు రద్దయినట్లు పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఇండిగో ఓ ప్రకటనలో తెలిపింది. క్రమంగా తమ విమానాలు పునరుద్ధరించనున్నామని వెల్లడించింది. విమానాల రద్దు కారణంగా ప్రభావితమైన ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. 48 గంటల్లో తమ కార్యకలాపాలు సాధారణ స్థితికి వస్తాయని తెలిపింది. ఇక, విమానాల ఆలస్యం నేపథ్యంలో పౌర విమానయాన మంత్రిత్వశాఖ ఎయిర్ సేవా పోర్టర్‌లో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఒక్క రోజులోనే ఇండిగో సంస్థపై 100కు పైగా ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తోంది. పైలట్ల కొరతే దీనికి ప్రధాన కారణమని డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తెలిపింది. కొనసాగుతున్న రద్దీలను పరిశీలిస్తున్నామని, సమస్యను పరిష్కరించేందుకు సంస్థతో కలిసి పనిచేస్తున్నామని పేర్కొంది. దీనిపై విచారణ జరుపుతామని వెల్లడించింది.

## సర్వీసులను పునరుద్ధరిస్తాం : ఇండిగో సీఈవో ఎల్బర్స్

**న్యూఢిల్లీ, డిసెంబరు 4 :** దేశవ్యాప్తంగా ఇండిగో విమాన సేవల్లో నెలకొన్న అంతరాయంపై సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్ స్పందించారు. ప్రస్తుతం తమ ముందున్న ప్రధాన లక్ష్యం కార్యకలాపాలను సాధారణ స్థాయికి తీసుకురావడమేనని ప్రకటించారు. తద్వారా సర్వీసుల సమయాన్ని పూర్వ స్థితికి తీసుకొస్తామన్నారు. కానీ, ఇది అంత సులభమైన పని కాదని అభిప్రాయపడటం గమనార్హం. ఈ మేరకు ఆయన గురువారం ఉద్యోగులకు లేఖ రాశారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామన్న హామీని ఇండిగో నిలబెట్టుకోలేకపోయిందని ఎల్బర్స్ అంగీకరించారు. దీనివల్ల కొన్నిరోజులుగా కస్టమర్లు, తమ సహచరులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. దీనికి తాము ఇప్పటికే బహిరంగంగా క్షమాపణలు చెప్పామని పేర్కొన్నారు. ఇండిగోలో తలెత్తిన గందరగోళానికి గల కారణాలను ఎల్బర్స్ తెలిపారు. సాంకేతిక సమస్యలు, షెడ్యూల్‌లో మార్పులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, డీజీసీఏ నిర్దేశించిన కొత్త నియమాల వంటివి అందుకు కారణమని వివరించారు. తమ విశాల నెట్‌వర్క్ నేపథ్యంలో ఈ ఇబ్బందులన్నీ తక్షణమే పెద్దవిగా పరిణమించాయని తెలిపారు. ఫలితంగా పలు దశల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏర్పడుతోందన్నారు. దానికి చాలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు.




## పెళ్లి పేరిట ఆన్‌లైన్‌లో మోసం..

### పోలీసులకు మహిళ ఫిర్యాదు

**హైదరాబాద్, డిసెంబరు 4 :** ఆన్‌లైన్‌లో పెళ్లి పేరుతో ఓ మహిళ మోసానికి గురైంది. వివరాల్లోకి వెళితే.. హిరాద్ అహ్మద్ అనే వ్యక్తి యూకేలో డాక్టర్‌గా పనిచేస్తున్నట్లు నటిస్తూ మహిళకు పరిచయమయ్యాడు. వాట్సప్ కాల్స్, మెసేజ్‌లు, వీడియో చాటింగ్ చేసేవాడు. వివాహ ప్రతిపాదన పేరుతో రెండు బ్యాంక్ ఖాతాలు ఓపెన్ చేయడంతో పాటు రెండు కొత్త సిమ్‌లు కొనుగోలు చేశాడు. బ్యాంకు పాస్‌బుక్‌లు, ఏటీఎం కార్డులను న్యూదిల్లీలోని యూకే వ్యవహారాల కార్యాలయానికి పంపాలని ఒత్తిడి చేశాడు. నకిలీ వీసా, వివాహ పత్రాలు పంపాడు. ప్రాసెసింగ్, వీసా ఫీజులు, ఆలస్యానికి జరిమానాలు, లగేజ్ సమస్యలు, హోటల్ బస ఇలా వివిధ కారణాలు చెప్పి డబ్బు డిమాండ్ చేశాడు. దీంతో రూ.3,38,200 ఆ మహిళ బదిలీ చేసింది. ఆ తర్వాత కాంటాక్ట్ నిలిచిపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మా కంపెనీలో ఉద్యోగానికి డిగ్రీ అక్కర్లేదు : జోహో సీఈఓ



**న్యూఢిల్లీ, డిసెంబరు 4 :** సామాజిక అంశాలపై జోహో కార్పొరేషన్ సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు తరచూ తన అభిప్రాయాలు వ్యక్తంచేస్తుంటారు. తాజాగా డిగ్రీ చదువుల గురించి మాట్లాడారు. తన కంపెనీలో ఉద్యోగానికి డిగ్రీ అక్కర్లేదని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. "మా కంపెనీలో ఉద్యోగానికి డిగ్రీ అక్కర్లేదు. డిగ్రీలు చదవాలని పిల్లలపై తల్లిదండ్రులు ఒత్తిడి చేయొద్దు. ప్రస్తుతం అమెరికాలో కొందరు తెలివైన విద్యార్థులు కళాశాలకు వెళ్లడం మానేస్తున్నారు. ముందుచూపు కలిగిన సంస్థలు వారికి అవకాశం ఇస్తున్నాయి. ఒక కాగితం కంటే ప్రతిభ, ఉత్సుకత చాలా ముఖ్యం. డిగ్రీల కోసం అప్పులు చేసే బదులు ఆచరణాత్మక సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలి. దీనిద్వారా యువత ప్రపంచాన్ని చూసే విధానం మారుతుంది. ఈ తరహా మార్పును తల్లిదండ్రులు అర్థం చేసుకొని, పిల్లలు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకునేలా ప్రోత్సహించాలి" అని వెంబు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. భారత్‌లో ఇలాంటి ఆలోచనా దృక్పథం ఉండాలని, ఉద్యోగంలోనే నేర్చుకునేలా జోహో వంటి సంస్థలు అవకాశం కల్పిస్తున్నాయని ఓ నెటిజన్ కామెంట్ పెట్టారు. కాలేజ్‌కు వెళ్లడం ఒక సోషల్ ఎంటర్టైన్‌మెంట్ కోసమేనని మరొకరు రాసుకొచ్చారు. ఇదిలా ఉంటే.. క్లౌడ్ ఆధారిత బిజినెస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ జోహో కార్పొరేషన్‌కు సీఈఓగా పనిచేసిన శ్రీధర్ వెంబు.. ప్రస్తుతం కంపెనీ చీఫ్ సైంటిస్ట్‌గా పరిశోధన, అభివృద్ధిపై దృష్టి సారించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో వస్తున్న మార్పులతో పాటు తన సంస్థ ఎదుర్కొంటున్న పలు సవాళ్లు, అవకాశాల దృష్ట్యా ఆయన ఈ బాధ్యతల్లో నిమగ్నమయ్యారు.

## కారు టైరు పేలి వ్యక్తి మృతి

### మృతుడు హైదరాబాద్ వాసిగా గుర్తింపు

**చీరాల, డిసెంబరు 4 :** బంధువుల తరపు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాద సంఘటన బాపట్ల జిల్లా కారంచేడు, చీరాల నూతన జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన మనోహర్ రాజు తన సోదరుడు నిరీక్షణ రాజు, మిత్రుడు జాన్ సన్ తో కలిసి చీరాల మండలం వాడరేవులో మృతి చెందిన బంధువును పరామర్శించేందుకు కారులో బయలుదేరారు. కారంచేడు సమీపానికి చేరుకోవడంతో వారి ప్రయాణిస్తున్న కారుకు రన్నింగ్ లో టైరు పేలిపోయింది. దీంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి గాల్లో పల్టీలు కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో సీట్‌బెల్ట్ పెట్టుకున్న ప్పటికీ మనోహర్ రాజు (45) తలకు తీవ్రమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన సోదరుడు నిరీక్షణ రాజు, జాన్ సన్‌కి గాయాలయ్యాయి. విషయం గమనించిన స్థానికులు అంబులెన్స్‌కి, పోలీసులకి సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మఅతదేహాన్ని పరిశీలించి పోస్టు మార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యాశాలకు తరలించారు. ఈ మేరకు కారంచేడు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు హైదరాబాదులో టీవీ 9 విలేకరి అని తెలిసింది. కాగా గాయపడిన ఇద్దరిని చీరాల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరామర్శకు బయలుదేరిన కుటుంబంపై మృత్యువు మరోసారి విరచుకుపడడంతో బంధువులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## పాక్‌కు సైనిక సమాచారం చేరవేత

### ఇద్దరిని అరెస్ట్ చేసిన గుజరాత్ ఎటిఎస్

**న్యూఢిల్లీ, డిసెంబరు 4 :** సైనిక వ్యవహారాలకు సంబంధించిన సున్నిత సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్న ఓ ఆర్మీ విశ్రాంత ఉద్యోగి, మరో మహిళను గుజరాత్ ఏటీఎస్ అరెస్టు చేసింది. ఈ ఇద్దరూ పాకిస్థానీ ఏజెంట్లతో సమాచారాన్ని పంచుకుంటున్నట్లు గుర్తించింది. సైన్యం కదలికలు, కీలక అధికారుల బదిలీల గురించి సమాచారం అందించమని అతన్ని పాక్ నిఘా సిబ్బంది ప్రలోభపెట్టినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు.. కొంతమంది సైనిక సిబ్బందిని హనీట్రాప్ చేయమని ఆ మహిళకు చెప్పారన్నారు. ఈ గూఢచర్య నెట్‌వర్క్‌కు సంబంధించిన ఆధారాలను నిందితుల ఫోన్ల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గుజరాత్ ఏటీఎస్ ఎస్పీ సిద్దార్థ్ కోరుకొండ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన అజయ్‌కుమార్ సింగ్ (47) సైన్యంలో పనిచేసి 2022లో రిటైరయ్యాడు. ప్రస్తుతం గోవాలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతడు సైన్యంలో సుబేదార్‌గా ఉన్నప్పుడే.. 'అంకిత శర్మ' పేరుతో ఓ పాకిస్థానీ నిఘా అధికారి అతన్ని సంప్రదించాడు. పరిచయం పెంచుకుని.. భారత ఆర్మీ రెజిమెంట్ల కదలికలు, కీలక ఆర్మీ అధికారుల బదిలీల వంటి సున్నితమైన సమాచారాన్ని టెక్స్ట్, ఫొటోలు, వీడియోల రూపంలో పంపించాడు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన రష్మణి పాల్ (35).. 'ప్రియా ఠాకుర్' అనే నకిలీ గుర్తింపుతో పనిచేస్తోంది. డబ్బుకు ఆశపడి పాక్ ఏజెంట్లు చెప్పినట్లు.. సైనిక సిబ్బందితో స్నేహం చేయడం ద్వారా వారి నుంచి సమాచారాన్ని సేకరించినట్లు సమాచారం.

# సవాల్ విసురుతున్న గంజాయి మాఫియా!



**గంజాయి మాఫియా విజృంభిస్తోంది. తాజాగా నెల్లూరు జిల్లాలో గంజాయి మాఫియా గ్యాంగ్ ఘాతుకానికి కొట్టాచిట్టం పెంచలయ్య బలయ్యారు. ఇది ఆరంభం మాత్రమే. ఎందుకంటే ఇప్పటి వరకు గంజాయి మాఫియా పట్టుబడడం లేదా తప్పించుకోవడం మాత్రమే చూశాం. ఇక హత్యలకు సంకేతం అన్నట్లుగా పెంచలయ్య మర్డర్‌ను భావించాలి. పెంచలయ్యను చంపిన దుర్మార్గులను వారి వెనుకనున్న డాన్‌లపైన దృష్టి పెట్టాల్సి ఉంది. ఈ విషయంలో ఎపి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలి. ఎందుకంటే గంజాయి చాపకింద నీరులా ప్రవహిస్తోంది.కాసులు కురిపించడంతో పలువురు దీనికి ఆకర్శితులై కుటీరపరిశ్రమగా వాడుకుంటున్నారు.**

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గంజాయి బాగా విస్తరించింది. అన్ని ప్రాంతాలలో విచ్చలవిడిగా గంజాయిని సరఫరా చేస్తున్నారు. దీనితో విద్యార్థులు యువత చెడుదారి పడుతున్నారు. డ్రగ్స్ మాఫియాల వెనక రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల నాయకుల అండదండలు ఉన్నాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. వారిపై ఉక్కుపాదం మోపి, తక్షణం డ్రగ్స్, గంజాయి తదిర మాఫియాలను నిర్మూలించాల్సి ఉంది. ఎందుకంటే మద్యం, గంజాయి, డ్రగ్స్ మాఫియాలను అరికట్టకపోతే సమాజం దారి తప్పుతుంది. పాలకులు ఎంతసేపు పెన్షన్ల పంపిణీ, బియ్యం పంపిణీలపై దృష్టి పెట్టడం మానాలి. హెలికాప్టర్లు వేసుకుని ఊరేగడం మానాలి. హెలికాప్టర్, విమానాల్లో తిరగడానికి వందల కోట్లు తగలేస్తున్నారు. ఆ డబ్బులను మాఫియాలను అరికట్టేందుకు వినియోగించాలి. ప్రజా చైతన్య కార్యక్రమాలను చేపట్టాలి. విశాఖ,మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి విచ్చలవిడిగా సాగవుతోంది. అక్కడ నుంచి జిల్లాలోకి అక్రమంగా గంజాయి రవాణా అవుతోంది. ముఖ్యంగా ఒడిశా, అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఎక్కువగా వస్తోంది. మారేడుమిల్లి, రంపచోడవరం మీదుగా జగ్గంపేటకు గంజాయి రావాణా సాగుతోంది. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా ఎగుమతి అవుతోంది.

ఇటీవల తెలంగాణలో కూడా విచ్చల విడిగా గంజాయి ప ట్టుబడుతోంది. అయితే పట్టుబడుతున్న గంజాయి లేదా డ్రగ్స్ కొంత మాత్రమే. ఇప్పటికే అది గుట్టుచప్పుడు కాకుండా రవాణా అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వాలు తలచుకుని గట్టిగా చర్యలు తీసుకుంటే దీనిని అరికట్టవచ్చు. మొగ్గలోనే దీనిని తుంచివేయాలి. ఈగిల్ టీమ్‌లకు మరింత బలగాలను ఇచ్చి అదేపిగా తనిఖీలు చేపట్టాలి. ఎక్కడెక్కడ పండిస్తున్నారో గుర్తించి ధ్వంసం చేయాలి. అయితే పోలీసులు నిఘా పెట్టి అరెస్టులు చేస్తున్నా గంజాయి రవాణా మాత్రం ఆగట్లేదన్న ఆరోపణలే ఎక్కువగా ఉన్నాయి. ప్రధానంగా నగరాల్లో విద్యార్థులు, యువతను టార్గెట్ చేస్తున్నారు. అందుకే పట్టణ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. యువత, విద్యార్థులనే గంజాయి మాఫియా టార్గెట్ చేసుకుంటోంది. ఒంటరిగా, జులాయిలా తిరిగే యువకులను రవాణాకు ఉపయోగించుకుంటోంది. గంజాయిని చిన్నచిన్న పొట్లాలు, లిక్విడ్, చాక్లెట్లుగా మార్చి యువతకు, విద్యార్థులకు అమ్ముతున్నారు. ఎక్కువగా ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల యువతనే వీరు లక్ష్యంగా చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. ఇటీవల ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలు సందర్భాల్లో ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు గంజాయి సేవిస్తూ పోలీసులకు చిక్కారు. కొన్నిచోట్ల రాజకీయ పలుకుబడితో కేసు నుంచి వారు తప్పించుకున్నారు. ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. గత జగన్ ప్రభుత్వ హయాంలో గంజాయి విక్రయాలు యథేచ్ఛగా సాగాయి. ప్రస్తుత ప్రభుత్వ హయాం లోనూ పరిస్థితిలో పెద్దగా మార్పు కానరావడంలేదు. మేము అధికారంలోకొస్తే గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపుతాం అని టిడిపి అధినేత చంద్రబాబు చెప్పుకొచ్చారు. అధికారంలోకొచ్చి ఏడాదిన్నర అయినా గంజాయికి అడ్డుకట్ట పడడంలేదు. గత ప్రభుత్వం లో మాదక ద్రవ్యాలు, గంజాయి రాష్ట్రమంతటా పాకాయి. వాటి మూలాలను గుర్తించి నివారించాలి.

యువతను గంజాయి మత్తు నుంచి బయటకు తీసుకురావాలి. మాదకద్రవ్యరహిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించాలి. ఇప్పటికీ గంజాయి మాఫియా రెచ్చిపోతోందనే విమర్శలు ఉన్నాయి. ఇందుకు పాలకపక్షం లోని కొందరి అండదండలే కారణమని ప్రచారం జరుగుతోంది. తాజాగా నెల్లూరు ఘటన దీనికి పరాకాష్టగా చూడాలి. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న పెంచలయ్యను దారుణంగా హత్య చేయడం దారుణంకాక మరోటి కాదు. ఈ ఘటనతో స్థానికుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ప్రధాన హంతకుడు జేమ్స్ ఇంటిని వారు దగ్ధం చేశారు. నెల్లూరు నగరంలోని అయ్యప్పగుడి ప్రాంతంలోని ఆర్‌డిటి కాలనీలో పెంచలయ్య ఉంటున్న వీధిలోనే జేమ్స్ కుటుంబం ఉంటోంది. జేమ్స్ అక్క అరవ కామాక్షి గంజాయి, మాదక ద్రవ్యాలు, దొంగతనాలకు యువకులను ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో పెంచలయ్య తన స్నేహితులతో కలిసి గంజాయి అమ్మకాలు, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. కామాక్షి తమ కాలనీకి రావద్దంటూ స్థానికులు నిర్ణయం చేశారు. దీంతో, కక్ష పెంచుకున్న జేమ్స్ మరికొందరితో కలిసి పెంచలయ్య ను హత్య చేశారని స్థానికులు చెబుతున్నారు. గంజాయిని అమ్మవద్దంటే చంపేస్తారా? అంటూ స్థానిక మహిళలు, యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల్లో చైతన్యం తీసుకుని వస్తే వారే దీనిపై పోరాడుతారు. వారే సమాచారం ఇస్తారు. ఇక తెలంగాణలోనూ ఇటీవల ఈగిల్ టీమ్ దాడులు పెంచింది. పెద్ద ఎత్తున దాడులు చేస్తూనే ఉంది. ఇటీవల ఢిల్లీలో కూడా దాడులు చేసింది. అయినా మత్తు మాఫియాదే పైచేయి అవుతోంది. దీనిని కఠినంగా అణచివేయాలి. అందకు చిత్తశుద్ధితో కృషి చేయాలి. రవాణా జరుగుతున్న తీరును గుర్తించి మాటువేయాలి. విశాఖ నుంచి గంజాయి సరఫరా అవుతోంది. భద్రాచలం ఏజెన్సీ నుంచి కూడా వస్తోంది. ఈ రెండు ప్రాంతాల్లో గజాయి తోటలను ధ్వంసం చేస్తూ పోవాలి. అప్పుడే కొంతలో కొంతయినా విజయం సాధించవచ్చు.

# ఆదాలాబాద్‌కు ఇక మహర్దశ

- సిఎం హామీతో మారనున్న ముఖచిత్రం
- మంత్రి వివేక్ వెంకటస్వామి



**ఆదిలాబాద్, డిసెంబరు 4 :** సిఎం రేవంత్ రెడ్డి హామీలతో ఆదిలాబా ద్ రూపురేఖలు మారనున్నాయని మంత్రి వివేక్ అన్నారు. అలాగే రాష్ట్రంలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు 95 శాతం స్థానాల్లో విజయం సాధిస్తారని, ఎన్నికల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి పరాభవం తప్పదని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి అన్నారు. గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేయడంతో పాటు వాటిని పట్టణాలకు ధీటుగా అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించిందన్నారు. ఆదిలాబాద్ సిఎం సభలో పాల్గొన్న అనంతరం ఆయన తనను కలిసిన విలేకర్లతో మాట్లాడా రు. ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్టు, విశ్వవిద్యాలయం రావడం ప్రజాప్రభుత్వం విజయమని అన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను క్రమక్రమంగా అమలు చేస్తున్నామ న్నారు. సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల విద్యుత్ ఫ్రీ, నూతన రేషన్ కార్డులు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఈ ఎన్నికల్లో వీటినే ప్రచారాస్త్రాలుగా నాయకులు ఉపయోగించాలని సూచించారు. అనంతరం పంచాయతీల్లో పోటీ చేసే అభ్యర్థులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సింగరేణిలో కొత్త ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని దీనికి సంబంధించి తమ ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మందమర్రి ఏరియాలోని ఆర్‌కే ఓసీ విస్తరణతో ఏరియాకు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఓసీ విస్తరించే ప్రాంతాల్లో ప్రజల డిమాండ్లను కూడా యాజమాన్యం పరిష్కరించాలన్నారు. సింగరే ణిలో నాలుగు బొగ్గు బ్లాకులకు సంబంధించి ఒరిస్సా తరహాలోనే వేలం పాటంలో దక్కించుకోవాలని కోరుతున్నామని తెలిపారు.

## హెల్త్ సెక్యూరిటీ బిల్లు
# లోక్‌సభలో ప్రవేశ పెట్టిన నిర్మలమ్మ



**న్యూఢిల్లీ, డిసెంబరు 4 :** లోక్‌సభలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ హెల్త్ సెక్యూరిటీ సెస్, నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు 2025ను ప్రవేశపెట్టారు. రెండు ప్రయోజనాల రీత్యా కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఒకటి ఆరోగ్య భద్రత, రెండు జాతీయ భద్రత ఈ రెండు అంశాలపై ఈ బిల్లును రూపొందించినట్లు సీతారామన్ తెలిపారు. ఆరోగ్యానికి హాని కలిగించే వస్తువులపైనే ఉదాహరణకు పాన్ మసాలా వంటి వస్తువులపై పన్ను విధించబడుతుందని ఈ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా నిర్మలాసీతారామన్ స్పష్టం చేశారు. కాగా, ఈ బిల్లును ప్రతిపక్ష ఎంపీలు వ్యతిరేకించారు. ప్రభుత్వం ధూమపానం చేసేవారిపై పన్ను విధిస్తుంటే.. ఢిల్లీ గాలి మాత్రం మరింత విషపూరితంగా ఉందని సిపిఐ(ఎం) ఎంపీ శివదాసన్ ఎద్దేవా చేశారు. దీనిపై ఎన్‌సిపి ఎంపి సుప్రియా సూలే స్పందించారు. ఈ బిల్లుని తేవడం మంచిదే కానీ.. సెస్ రూపంలో పన్నులు ఎందుకు వసూలు చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. దీని ద్వారా పన్నుల ద్వారా ఆదాయం పెరుగుతుంది. కానీ ఈ ఆదాయం రాష్ట్రాలకు అందదు అని కేంద్రంపై ఆమె ఆరోపించారు. బిల్లు చర్చ సందర్భంగా బీడి మాత్రం 40 శాతం స్లాబ్‌లోకి వెళ్లలేదు. 28 శాతం స్లాబ్ లేనందున బీడి 18 శాతం శ్లాబ్ కిందకి వచ్చింది అని నిర్మలా సీతారామన్ అన్నారు.

# బంగారం, వెండి ధరల్లో దూకుడు

- గరిష్టస్థాయికి చేరుకున్న ధరల పెరుగుదల
- బంగారంతో పోటీ పడుతున్న వెండి ధరలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 4 :** దేశంలో పసిడి ధరలు మళ్లీ పెరిగాయి. మంగళవారం కాస్తంత తగ్గిన ధరలు మళ్లీ విజృంభించాయి. వెండి ధర కూడా రికార్డు స్థాయికి చేరింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ నెమ్మదిస్తున్న వైనం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు కోతపై అంతకంతకూ పెరుగుతున్న ఆశలు గోల్డ్‌కు డిమాండ్ మరింతగా పెరిగేలా చేస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, భారత్‌లో గురువారం ఉదయం 6.30 గంటల సమయంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,30,590గా ఉంది. నిన్నటి రేట్‌తో పోలిస్తే ఇది రూ.720 అధికం. 22 క్యారెట్ 10 గ్రాముల గోల్డ్ రేట్ కూడా రూ. 650 మేర పెరిగి రూ.1,19,710కు చేరుకుంది. ఇక పారిశ్రామిక డిమాండ్ అధికంగా ఉండటంతో వెండి ధరలూ రికార్డు స్థాయిని తాకాయి. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.1,91,100 వద్ద జీవితకాల గరిష్ఠానికి చేరింది. ఏడాదిలో ఇప్పటివరకూ బంగారం ధరలు 40 శాతం మేర పెరిగాయని పరిశీలకులు చెబుతున్నారు. వచ్చే ఏడాది కూడా గోల్డ్ రేట్స్‌లో జోరు కొనసాగుతుందని గోల్డ్‌మన్ శాక్స్ రీసెర్చ్ తాజా నివేదికలో తేలింది. కేంద్ర బ్యాంకులు భారీగా పసిడి కొనుగోళ్లకు దిగడం, నెమ్మదిస్తున్న అమెరికా ఆర్థిక వృద్ధి, బలహీనపడుతున్న డాలర్ వంటివి పుత్తడికి డిమాండ్ పెంచుతున్నాయి. ఇక అమెరికా ఫెడరల్ రిజర్వ్ చీఫ్‌గా కొత్త వ్యక్తిని ఎంపిక చేస్తామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో వడ్డీ రేట్ కోతపై ఆశలు మరింత పెరిగాయి. ఫలితంగా బంగారం ధరలు మరింత ఎగబాకాయి. ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధన రంగాల నుంచి డిమాండ్ విపరీతంగా ఉండటం, సరఫరాలో తగ్గుదల వెరసి వెండి ధర ఆల్ టైమ్ గరిష్ఠాన్ని తాకేలా చేశాయి. గతేడాదితో ధరలతో పోలిస్తే అంతర్జాతీయ మార్కెట్‌లో వెండి ధర ఇప్పటివరకూ సుమారు 101 శాతం మేర పెరిగింది.

# చలాన్లపై రాయితీ వార్తల ప్రచారం

**అలాంటిదేమీ లేదని ఖండించిన ట్రాఫిక్ విభాగం**

**హైదరాబాద్, డిసెంబరు 4 :** ట్రాఫిక్ చలాన్లపై భారీ తగ్గింపుల పేరుతో తిరుగుతున్న ఈ ప్రచారం మొత్తం ఫేక్ అని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. పెండింగ్ చలాన్లు క్లియర్ చేసేందుకు ఇది మంచి అవకాశం అనుకుంటున్న వాహనదారులు అసత్య సమాచారానికి గురికావద్దని విజ్ఞప్తి చేశారు. ఇటీవలి రోజుల్లో ఇంటర్నెట్‌లో డిసెంబర్ 13న చలాన్లపై పూర్తి రాయితీలు ఇస్తున్నారంటూ వేగంగా ప్రచారం నడుస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసులు తమ అధికారిక ట్విట్టర్ ద్వారా స్పష్టతనిచ్చారు. ఆ తేదీన ఎలాంటి లోక్ అదాలత్ నిర్వహించడంలేదని, చలాన్లపై రాయితీలకు సంబంధించిన ఎలాంటి అధికారిక నోటిఫికేషన్ ఇప్పటివరకు జారీ కాలేదని తెలిపారు. ప్రజలు ఇలాంటి తప్పుడు పోస్టులను నమ్మకుండా, మరెవరికి పంపకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఇక తరచూ చలాన్లపై డిస్కౌంట్లు ప్రకటించడం సరికాదని, అలాంటి రాయితీలు వాహనదారుల్లో భయం తగ్గించి నిబంధనల ఉల్లంఘనలు పెరిగే అవకాశముందని హైకోర్టు ఇప్పటికే వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ట్రాఫిక్ చలాన్లపై ఎలాంటి రాయితీ లేదు. పెండింగ్ చలాన్ల గురించి నమ్మకమైన, అధికారిక సమాచారం కోసం మాత్రమే పోలీసుల వెబ్‌సైట్‌లు, యాప్‌లను వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు.



RACHAKONDA TRAFFIC POLICE

FAKE NEWS ALERT

It has come to our notice that certain messages and videos are circulating on social media claiming that there will be **"up to 100% discount on Traffic Challans on December 13."**

This information is FALSE.

No such notification has been issued by the Telangana Police or any Lok Adalat.

✔ Trust ONLY official Telangana Police & Rachakonda Police channels
✘ Do NOT believe or forward unverified messages or videos

# ఉద్యోగాల పేరిట ఎర

- సైబర్ క్రైమ్ ఉచ్చులో దింపడం
- మోసగాళ్ల ముఠా గుట్టు రట్టు

**హైదరాబాద్, డిసెంబరు 4 :** నిరుద్యోగులే వారి టార్గెట్.. విదేశాల్లో మంచి ఉద్యోగం అని చెబుతారు.. లక్షల్లో జీతం, అన్ని రకాల సౌకర్యాలుంటాయని నమ్మబలుకుతారు. విదేశాలకు పంపిస్తారు.. విదేశాల్లో ఉద్యోగం అని ఎన్నో ఆశలతో వెళ్లిన నిరుద్యోగులకు చేయకూడని పనులన్నీ చేయిస్తారు. విదేశీ ఉద్యోగం పేరుతో సైబర్ క్రైమ్ కాల్ సెంటర్లకు నిరుద్యోగ యు-వతను పంపుతున్న మోసగాళ్ల ముఠా గుట్టు రట్టు అయింది. నిరుద్యోగ యువతను ఆకర్షించి మోసాలకు పాల్పడుగున్న సైబర్ క్రైం ఏజెంట్ల గ్యాంగ్‌ను పోలీసులు పట్టుకున్నారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి అక్కడ సైబర్ క్రైం చేయిస్తున్న ఏజెంట్ల గ్యాంగ్‌ను సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. ఉద్యోగాల పేరుతో యువతను మియన్మార్, థాయ్‌లాండ్‌కు తరలిస్తున్న హైదరాబాద్, విశాఖపట్నం, మైసూర్‌కు చెందిన ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. సైబర్ నేరాలకు సంబంధించి ఈ గ్యాంగ్ పై పలు కేసులు నమోదు చేశారు. విదేశీ ఉద్యోగాల పేరుతో పొంచివున్న ప్రమాదంపై యువత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

# ఆదిలాబాద్‌కు విమానాశ్రయం అదృష్టం

**సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన పాయల శంకర్**

**ఆదిలాబాద్, డిసెంబరు 4 :** ఆదిలాబాద్ కు విమానాశ్రయం కావాలని గతంలో సిఎం రేవంత్ రెడ్డిని తాను అడిగానని బిజెపి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. కేంద్రం మంజూరు చేస్తే.. కావాల్సిన సహకారం అందిస్తానని సిఎం అన్నారని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్న సిఎం కు ధన్యవాదాలు తెలియజేశారు. ఆదిలాబాద్ లో సిఎం పర్యటించారు. ఇందిరా ప్రియదర్శిని మైదానంలో బహిరంగసభ నిర్వహించారు. రూ. 18.7 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు రేవంత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాయల్ శంకర్ మీడియాతో మాట్లాడుతూ..ప్రధాని నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్తే అంగీకరించారని, విమానాశ్రయానికి వెంటనే 800 ఎకరాల భూసేకరణకు సిఎం ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. మాజీ సిఎం కెసిఆర్ ప్రభుత్వం ఆదిలాబాద్ విమానాశ్రయానికి భూమి ఇచ్చేందుకు ముందుకు రాలేదని విమర్శించారు. నియోజక వర్గం అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా సిఎం ను కలుస్తానని చెప్పారు. చనాఖా-కొరాట ప్రాజెక్టుకు పెండింగ్ నిధులు విడుదల చేయాలని, సోయాబీన్ పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని అన్నారు. ఆదిలాబాద్ కు యూనివర్శిటీ మంజూరు చేయాలని రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నానని పాయల్ శంకర్ తెలియజేశారు.

## కోతుల సమస్యతో
# రైతుల పరేషన్

- జాతీయ సమస్యగా గుర్తించి చర్యలు తీసుకోవాలి
- లోక్‌సభలో ప్రస్తావించిన బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 3 :** కోతుల బెడదతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పెద్దమొత్తంలో వానరాలు పంటలను పాడు చేస్తున్నాయని చెప్పుకొచ్చారు. ఈ సమస్యను నివారించేందుకు జాతీయ స్థాయిలో కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కోతుల సమస్యపై గురువారం లోక్‌సభ జీరో అవర్‌లో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడారు.ఈ సమస్య తమ శాఖ కిందకు రాదని కొన్ని ప్రభుత్వ శాఖలు తప్పించుకుంటున్నాయని.. వానరాల సమస్య ఏ శాఖ కిందకు వస్తుందో చెప్పాలని ప్రశ్నించారు. కోతుల సమస్య చిన్న విషయంలాగా అనిపిస్తోందని.. కానీ అందరూ ఈ సమస్య గురించి తెలుసుకుని నవ్వుతారని పేర్కొన్నారు. తెలంగాణతో పాటు దేశంలోని చాలా రాష్ట్రాల్లో కోతుల సమస్య ఉందని గుర్తుచేశారు. విషయంలో నోడల్ ఏజెన్సీ అవసరమని చెప్పారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కోతుల సమస్యను ప్రజలు ప్రస్తావిస్తున్నారని గుర్తు చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కూడా ఈ సమస్య ఒక ఎజెండాగా మారిందని పేర్కొన్నారు. వానరాల సమస్యను పరిష్కరిస్తే సర్పంచ్‌గా గెలిపిస్తామని ప్రజలు అంటున్నారని.. దేశ రాజధాని ఢిల్లీలో కూడా ఈ సమస్య తీవ్రంగా ఉందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు.

# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

**ఖమ్మం, డిసెంబర్ 3 :** ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో కొనసాగుతున్న రెండో విడత కొనసాగు తున్నస్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ పక్రియలో భాగంగా నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీజ గురువారం పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలు, నామినేషన్ దరఖాస్తుల స్వీకరణ విధానాన్ని నామినేషన్ దరఖాస్తుల ఆమె సమీక్షించారు. నామినేషన్ పక్రియ పారదర్శకంగా, దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగించేందుకు అవసరమైన సలహాలు,సూచనలు అధికారులు,సంబంధిత సిబ్బందికి ఇచ్చారు.అదనపు కలెక్టర్ వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపిఓ రవీంద్ర ప్రసాద్,గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



## మీ ఇంటి ఆడబిడ్డనై ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

### సర్పంచ్ అభ్యర్థి గడ్డం ముత్తమ్మ

**ఆత్మకూర్( ఎం) రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం). మండలంలోని కూరెళ్ల గ్రామ బీజేపీ సీపీఎం బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గడ్డం ముత్తమ్మ గెలిపించాలని.గడప గడపకు తిరిగి కత్తెర గుర్తుకు ఓటు వెయ్యాలని ప్రచారం చేశారు.వారు మాట్లాడుతూ నన్ను గెలిపిస్తే కూరెళ్ల గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి సీసీ రోడ్లు నూతన స్ట్రీట్ లైట్స్ బీటి రోడ్లు గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఎరుకల స్వామి శ్రీహరి రాములు నర్సింహా బిక్షం అశోక్ యాదగిరి రెడ్డి మల్లయ్య మచ్చగిరి మాణికుమార్ నవీన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పలపహాడ్ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనా చిన్నం బీరప్ప

**ఆత్మకూర్( ఎం) రాజముద్రన్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండలం ఉప్పలపహాడ్ గ్రామ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన చిన్న బీరప్ప ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరించిన గ్రామ ప్రజలు ధన్యవాదములు తెలిపారు గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ప్రభుత్వం నుండి పదిహేను లక్షల రూపాయలు అభివృద్ధి పనుల కోసం వచ్చాయి వాటిని గ్రామ అభివృద్ధికి ఖర్చు చేస్తానని అన్నారు.అనంతరం ఉప సర్పంచ్ గా సరోజా లక్ష్మి ని ఎన్నుకున్నారు వార్డు సభ్యులుగా పావని అయోధ్య పరమేష్ స్వప్న నర్సింహా సునీత శ్రీనివాస్ రెడ్డిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## నన్ను గెలిపిస్తే గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

### సర్పంచ్ అభ్యర్థి సూగురు స్రవంతి హరిబాబు

**ఆత్మకూరు (ఎం ).రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు( ఎం).మండలంలోని పల్లెపహాడ్ గ్రామ సిపిఐ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి సూగురు స్రవంతి హరిబాబు గెలిపించాలని.గడప గడపకు తిరిగి కత్తెర గుర్తుకు ఓటు వెయ్యాలని ప్రచారం చేశారు.వారు మాట్లాడుతూ నన్ను గెలిపిస్తే గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అర్హులైన వారికీ అందజేస్తానని అన్నారు.ఈ కార్యక్రమం లో సిపిఐ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## గెలిపించండి సింగారం-కాల్వపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

### సర్పంచ్ అభ్యర్థి పన్నాల వనజ సత్తిరెడ్డి

**ఆత్మకూర్( ఎం )రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు( ఎం).మండల పరిధిలో సింగారం గ్రామ సిపిఐ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి పన్నాల వనజ సత్తిరెడ్డి కాల్వపల్లి లో ప్రచారం నిర్వహించారు.ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే కాల్వపల్లి సింగారం గ్రామ మధ్య ఉన్న కల్వర్ట్ వంతెన బ్రిడ్జి నిర్మిస్తానని రోడ్లు మౌలిక వసతులు ప్రభుత్వ నుండి వచ్చే సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందజేస్తానని అన్నారు.గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ జామ యాదయ్య రవీంద్రచారి చంద్రమౌళి డా కిరణ్ ప్రభాకర్ రెడ్డి సంజీవ రెడ్డి సురేందర్ రెడ్డి సత్యనారాయణ వేణు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## కత్తెర గుర్తుకు ఓటు వెయ్యండి

### సర్పంచ్ అభ్యర్థి నాగుల సత్యనారాయణ

**ఆత్మకూర్(ఎం), రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండల పరిధిలో పోతిరెడ్డిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి నాగుల సత్యనారాయణ గడపగడప తిరుగుతూ కత్తెర గుర్తుకు ఓటు వెయ్యాలని ప్రచారం చేశారు.వారు మాట్లాడుతూ అధికారం కాదు అభివృద్ధి ముఖ్యం అని ఓటర్లతో మమేకమై ముచ్చటించారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఎడమ మోహన్ రెడ్డి బిక్షం అమరేందర్ చారి భాస్కర్ రెడ్డి అంజయ్య శ్రీకాంత్ పుష్పలీల సుభద్ర లత లలిత లక్ష్మి రేణుక వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

### స్రవంతి హరిబాబులను ఓటేసి ఆశీర్వదించి

# సర్పంచ్‌గా గెలిపించండి

### ఓబీసీ మండల అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్



**ఆత్మకూరు (ఎం), రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండలంలోని పల్లెపహాడ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి సుగూరి స్రవంతి హరిబాబు లకు పల్లెపహాడ్ గ్రామ పంచాయతీ ఓటర్లు తమ అమూల్యమైన ఓటు కత్తెర గుర్తుపై వేసి ఆశీర్వదించి గెలిపించాలని కాంగ్రెస్ ఓబీసీ మండల అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్ అన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య సహకారంతో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పల్లెపహాడ్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి సుగూరి స్రవంతి హరిబాబు లను ఆశీర్వదించి గెలిపిస్తే వారు పల్లెపహాడ్ గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శిథిలావస్థలో ఉన్న శివాలయం పునఃర్ నిర్మాణం, ఆత్మకూరు నుండి పల్లెపహాడ్ వరకు డబుల్ రోడ్డు, గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి, సీసీ రోడ్లు, నూతన స్ట్రీట్ లైట్స్, పెద్ద వాగు పై చెక్ డ్యాం, పల్లెపహాడ్ నుండి మైసమ్మ గుండ్ల వరకు బీటి రోడ్డు, పల్లెపహాడ్ నుండి తేర్యాల కు వయా హరిచంద్రు బాయి నుండి బీటి రోడ్డు ఏర్పాటు , తొలి విడతలో ఇప్పటికే 25 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరి కాగా రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు వారి సహకారంతో చెప్పాడతామని అన్నారు.

## అజయ్‌తండా పంచాయతీ పీఠం కాంగ్రెస్‌దే

### సర్పంచ్ అభ్యర్థి తేజవత్ శివాజీ



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తారని నేలకోండపల్లి మండలంలోని అజయ్ తండా గ్రామ పంచాయతీ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి తేజవత్ శివాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమని చెప్పారు.సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారన్నారు.కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకి ప్రజలు ఆకర్షితులవుతున్నారని చెప్పారు.ప్రజా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీల అమలు,ఉచితవిద్యుత్,సన్నబియ్యం,కల్యాణ లక్ష్మి,వరి మద్దతు ధర,బోనస్,రుణమాఫీ,మహిళలకు వడ్డీ లేని రుణాలు వంటి పథకాలు అమలుతో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు.ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వంలో ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టనున్నారని ధీమా వ్యక్తం వ్యక్తం చేశారు.గ్రామంలోని 8 వార్డులతో కలిపి మొత్తం 530 మంది ఓటర్లు ఉన్నారని,ప్రతి వార్డులో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు.సర్పంచ్ గా గెలిచిన వెంటనే గ్రామంలో త్రాగు నీటి సౌకర్యం,సీసీ రోడ్లు,సైడ్ డ్రెయినేజీ,అంతర్గత రోడ్ల నిర్మాణం చేపడుతానని,వీధి దీపాలు ఏర్పాటు చేసి గ్రామాన్ని స్వచ్ఛ పరిశుభ్రతగా తీర్చి దిద్దుతానని హామీ ఇచ్చారు.జిల్లా కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపూసల సీతరాములు, బోడ్డు బోందయ్య, మామిడి వెంకన్న, కుక్కల హన్మంతరావు,నేల్లూరి భధ్రయ్య, ఆశీస్సులతో సర్పంచ్ గా గెలవడం ఖాయమని శివాజీ స్పష్టం చేశారు.

## చెన్నారం పంచాయతీ సర్పంచ్‌గా గెలిపించండి

- స్వతంత్ర అభ్యర్థి అంతోటి ఉష
- విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను కల్పిస్తా



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీ లేకుండా కృషి చేస్తానని ఆర్ఎంపీ వైద్యురాలు,సర్పంచ్ అభ్యర్థిని అంతోటి ఉష అన్నారు. నేలకొండపల్లి మండలంలోని చెన్నారం గ్రామ పంచాయతీ సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థిగా మంగళవారం ఆమె మద్దతుదారులతో కలిసి నామినేషన్ పత్రాలను సమర్పించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఆదరించి సర్పంచ్ గా గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని తెలిపారు.ప్రధానంగా విద్య,వైద్యం పై దృష్టి సారించడమే కాకుండా ఉపాధి మార్గాలను కూడా కల్పిస్తానని చెప్పారు. గ్రామంలోని ఒకటి నుండి పదో తరగతి చదివే విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ కేంద్రాన్ని చేసి గురుకుల, నవోదయ, సైనిక్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణను అందిస్తానని హామీ ఇచ్చారు.స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలకి ధీటుగా ఇంగ్లీష్ మీడియం విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.వైద్య వృత్తిలో కొనసాగుతూ అనేక మంది నిరుపేదలకు ఉచితంగా వైద్యం చేశానన్నారు. కరోనా విపత్తు సమయంలో గ్రామంలోని అనేక మంది కరోనా బారిన పడి ఇబ్బంది పడుతుంటే, ఎవరు పట్టించుకోక పోతే ధైర్యంగా తను ముందుకు వచ్చి వైద్య సేవలు అందించానని గుర్తు చేశారు.ప్రతి ఒక్కరికీ ఆరోగ్యాన్ని కాపాడేందుకు గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను చేపడుతానని భరోసా ఇచ్చారు.తన సేవలను గుర్తించి గ్రామస్తులు సర్పంచ్ గా భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## సుర్ధేపల్లి సర్పంచ్‌గా విజయకేతనం ఎగరవేస్తా

- కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి గరిడేపల్లి సుజాత
- ప్రజల ఆదరణతో జోరుగా సాగుతున్న ప్రచారం



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నేల కొండపల్లి మండలంలోని సుర్ధేపల్లి గ్రామ ప్రజలు ఆదరించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టనున్నారని సర్పంచ్ అభ్యర్థిని గరిడెపల్లి సుజాత అన్నారు.ఇటీవల సర్పంచ్ అభ్యర్థినిగా పార్టీ శ్రేణులు,మద్దతుదారులతో కలిసి నామినేషన్ వేసిన అనంతరం గ్రామంలో ప్రచార కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలైన ఆరు గ్యారంటీల అమలు,ఉచిత విద్యుత్, సన్నబియ్యం, వరి మద్దతు ధర,బోనస్, రుణమాఫీ, మహిళలకి వడ్డీలేని రుణాలతో ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని చెప్పారు.తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానని తెలియజేశారు.సుర్ధేపల్లి గ్రామంలో త్రాగు నీటి సౌకర్యం,సీసీ రోడ్లు,సైడ్ డ్రెయినేజీ,అంతర్గత రోడ్ల నిర్మాణం చేపడుతానని,వీధి దీపాలు ఏర్పాటు చేసి గ్రామాన్ని స్వచ్ఛ పరిశుభ్రతగా తీర్చి దిద్దుతానని హామీ ఇచ్చారు.గ్రామంలోని 8 వార్డులతో కలిపి మొత్తం 900 మంది ఓటర్లు ఉన్నారని,ప్రతి వార్డులో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు.జిల్లా కాంగ్రెస్ నాయకులు నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు, కొడాలి గోవిందరావు, మామిడి వెంకన్న, నెల్లూరు భద్రయ్య, ఆశీస్సులు,ప్రజల ఆదరణతో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయ కేతనం ఎగరవేస్తానని ధీమా వ్యక్తం చేశారు.

### ప్రజా సేవకై ముందడుగు..

# ఆశీర్వదించి గెలిపించండి

### మసానిగూడ బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బద్రి అర్చన ప్రభు గౌడ్

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** ప్రజా సేవకై గ్రామ సర్పంచ్ పదవికి నామినేషన్ వేసి ముందడగు వేస్తున్నానని, ఆశీర్వదించి గెలిపించాలని మసాని గూడ బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బద్రి అర్చన ప్రభు గౌడ్ గ్రామ ప్రజలను కోరారు. గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడమే లక్ష్యమని, గ్రామంలో మౌలిక వసతులైన మంచి నీరు, సిసి రోడ్లు, అండర్ డ్రనైజీ లాంటి పనులను పూర్తి స్థాయిలో పూర్తి చేసి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతామని తెలిపారు. మసాని గూడ నుండి పర్వేద వెళ్లే రోడ్డును లచ్చిరెడ్డి గూడ వద్ద కల్వర్టు నిర్మించి పూర్తి స్థాయి రాకపోకలకు థార్ రోడ్డుగా వేస్తానని హామీ ఇచ్చారు. అలాగే మసాని గూడ నుండి అనుబంధ గ్రామమైన కచ్చిరెడ్డి గూడ వరకు రోడ్డును థార్ రోడ్డుగా చేస్తామని తెలిపారు. గ్రామంలోని పేద ప్రజలకు ప్రతి నెల ఉచిత వైద్య సేవలు అందే విధంగా చూస్తామన్నారు. గ్రామం నుండి మెయిన్ రోడ్డు వరకు వెళ్లే రోడ్డును విస్తరించి, రోడ్డు వెంబడి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. స్మశాన వాటికలో అవసరమైన వసుతులు



కల్పిస్తామన్నారు. అదేవిదంగా అనుబంధ గ్రామాలైన కచ్చిరెడ్డి గూడ, మంచర్ల గూడ గ్రామాలలో ఉన్నా సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని అన్నారు. గ్రామంలోని ప్రజలకు అన్ని విధాలుగా తోడ్పాటు నందిస్తామని, గ్రామ అభివృద్దే లక్ష్యంగా సర్పంచ్ పోటీలో నిలుచున్నామని తెలిపారు. గ్రామ ప్రజలందరూ తమ అమూల్యమైన ఓటుతో తమను గెలిపించి గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.



### ఆశతో ఉన్నవాడికి అవకాశం ఇస్తే

## అధికారం ఇస్తే దోచుకుంటాడు

### రహీంఖాన్ పేట సర్పంచ్ అభ్యర్థి సుధాగాని కళావతి లింగయ్య

**ఆత్మకూర్( ఎం ).రాజముద్ర న్యూస్:** ఆత్మకూర్(ఎం) డిసెంబర్ 4 మండలంలోని రహీంఖాన్ పేట గ్రామంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ బీజేపీ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి సుధాగాని కళావతి లింగయ్య ఇంటింటికి తిరిగి ఒక హెూటలో పూరీలు చేస్తూ ఓటర్లను ఓటు అడిగారు కత్తెర గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అన్నారు.గెలిపిస్తే రహీంఖాన్ పేట గ్రామాన్ని అభివృద్ధి చేస్తా అని పలు సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ బీజేపీ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఉంగరం గుర్తు పై ఓటేసి గెలిపించండి

### సర్పంచ్ అభ్యర్థి ఎర్ర లింగారెడ్డి

**ఆత్మకూరు (ఎం), రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం లింగరాజుపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఎర్ర లింగారెడ్డి గడపగడప తిరుగుతూ ప్రచారం చేశారు.ఉంగరం గుర్తుపై ఓటేసి నన్ను గెలిపించాలని ఊరు అభివృద్ధి నాకు అప్పచెప్పండి అంటూ ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లగా పోటీ చేసే అభ్యర్థులు, కాంగ్రెస్ నాయకులు ,యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ విద్యార్థి నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అమ్మని గెలిపించండి అభివృద్ధి చేసే భాగ్యం కలిపించండి

### - నోముల రాజు

**ఆత్మకూరు (ఎం), రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో సీపీఎం పార్టీ బలపర్చిన బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి నోముల వెంకటమ్మ మల్లయ్య గౌడ్ గెలుపు కోసం వారి కుమారుడు నోముల రాజు,కుమార్తెలు మంజుల, పద్మ,శ్రీలత లు ఇంటిటా తిరుగుతూ తల్లీ గెలుపుకోసం ప్రచారం నిర్వహించారు. అనంతరం రాజు మాట్లాడుతూ సర్పంచ్ గా పోటీ చేస్తున్న కత్తెర గుర్తుపై ఓటేసి అమ్మని గెలిపించండి అభివృద్ధి బాధ్యత మేము తీసుకుంటాం ముందు ముందు దుర్గమ్మ బొడ్రాయి పండుగలు ,లైబ్రరీ ఏర్పాటు, పాఠశాలలో వసతులు,యువత కు వాలీబాల్ ,క్రికెట్ కిట్లు వంటి ప్రోత్సాహకాలు అందిస్తామని కత్తెర గుర్తు పై ఓటేసి గెలిపించే బాధ్యత మీది గ్రామాన్ని అభివృద్ధి చేసే బాధ్యత మాది అన్నారు. అలాగే పోటీచేసే వార్డు సభ్యులను కూడ గెలిపించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుల అభ్యర్థులు స్వామి, నవ్య, అరుణ, మత్యగిరి, నరేష్,నగేష్,ఆనంద్,మహేష్,ఉదేష్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ అభ్యర్థి విజయను గెలిపించండి

### మాజీ సర్పంచ్ కొండబాల వెంకటేశ్వర్లు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత తెలంగాణ తొలి సిఎం కేసీఆర్ దేనని తిరుమలాయపాలెం మాజీ సర్పంచ్ కొండబాల వెంకటేశ్వర్లు అన్నారు.గ్రామపంచాయితీ ఎన్నికల్లో భాగంగా సిపిఎం బలపరచిన బిఆర్ఎస్ అభ్యర్థి భానోత్ విజయ విజయాన్ని కాంక్షిస్తూ గురువారం ఆయన గ్రామంలో ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన విజయను గెలిపిస్తే నిస్వార్థంగా పనిచేసి గ్రామాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తుందన్నారు.చదువుకున్న యువతి విజయ గెలిస్తే తిరుమలాయపాలెం గ్రామాన్ని అన్ని విధాలుగా సమగ్రాభివృద్ధి చేపడుతుందని స్పష్టం చేశారు.వీధి దీపాలు ఏర్పాటు,సీసీ రోడ్లు,అంతర్గత రహదారులు, సైడ్ డ్రెయినేజీ నిర్మాణం,ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పించేందుకు విజయ ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తుందని తెలియజేశారు.

## కొక్కిరేణి సర్పంచ్ పీఠం బిఆర్ఎస్ కైవసం ఖాయం

### :సర్పంచ్ అభ్యర్థి నంబూరి శేషు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో తిరుమలాయపాలెం మండలంలోని కొక్కిరేణి గ్రామ బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా భారీ మెజారిటీతో గెలుపొందుతానని నంబూరి శేషు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొక్కిరేణి గ్రామంలో బలంగా ఉన్న బిఆర్ఎస్ కార్యకర్తలు,గ్రామస్తుల ప్రోత్సాహంతో సర్పంచ్ గా పోటీ చేస్తున్నానని వెల్లడించారు.గ్రామంలోని పది వార్డులలోని మొత్తం 1521 మంది ఓటర్లు సర్పంచ్ గా గెలిపిస్తే కొక్కిరేణి గ్రామాన్ని అభివృద్ధిలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానన్నారు.వీధి దీపాలు ఏర్పాటు,సీసీ రోడ్లు,అంతర్గత రహదారులు, సైడ్ డ్రెయినేజీ నిర్మాణం,ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పిస్తానని చెప్పారు.కోతుల నివారణతో పాటుగా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా,సీజనల్ వ్యాధులు ప్రభలకుండా బ్లీచింగ్ చేయించి,కనీస జాగ్రత్త చర్యలు తీసుకుంటునన్నారు. మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వేణుగోపాలకృష్ణ ఆశీస్సులతో సర్పంచ్ గా విజయ బావుటా ఎగురవేస్తానని ధీమా వ్యక్తం చేశారు.

## నేవీ డే సందర్భంగా
# మోడీ శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 3 :** భారత నేవీ డే సందర్భంగా ప్రధాని మోడీ నావికాదళ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ' భారత నావికాదళంలోని సిబ్బంది అందరికి నావికాదళ దినోత్సవ శుభాకాంక్షలు. మన నావికాదళం అసాధారణ ధైర్యం, దృఢ సంకల్పానికి పర్యాయపదం. వారు మన తీరాలను కాపాడుతారు. మన సముద్ర ప్రయోజనాలను కాపాడుతారు. ఇటీవలి సంవత్సరాలలో, మన నావికాదళం స్వావలంబన, ఆధునీకరణపై దృష్టి పెట్టింది. ఇది మన భద్రతను మెరుగుపరిచింది.' అని పోస్టులో పేర్కొన్నారు.

# 'అదనపు సిబ్బందిని తీసుకోండి'..
### బీఎల్‌వోల ఆత్మహత్యల వేళ 'సుప్రీం' సూచన



**న్యూఢిల్లీ, డిసెంబర్ 3 :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతున్న రాష్ట్రాల్లో బూత్ స్థాయి అధికారులు తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారనే ఆరోపణలు వస్తున్నా యి. పలువురు బీఎల్‌వోలు అనారోగ్యానికి గురి కావడం, రాజీనామాలు చేస్తుండటం, పలువురు ఆత్మహత్యకు పాల్పడుతున్న ఘటనలు కలవరపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీం కోర్టు కీలక సూచనలు చేసింది. బీఎల్‌వోల పని గంటలను తగ్గించేం దుకు అదనపు సిబ్బందిని నియమించే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని చెప్పింది. నిర్ణీత సమయంలో విధులు నిర్వర్తించనందుకుగానూ బీఎల్‌వోలపై బలవంతపు చర్యలు తీసుకోవద్దంటూ ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ నటుడు విజయ్‌కు చెందిన టీవీకే పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. తీవ్ర పని ఒత్తిడి కారణంగా అనేక మంది బీఎల్‌వోలు మరణించారని, విధులు నిర్వర్తించడంలో విఫలమైతే వారిపై కేసులు కూడా నమోదు చేస్తున్నారని టీవీకే తరఫు న్యాయవాది వాదించారు. ఈ నేపథ్యంలో కొన్ని సూచనలు జారీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీఎల్‌వోలపై పని ఒత్తిడిని తగ్గించేందుకు అదనపు సిబ్బందిని నియమించడాన్ని రాష్ట్రాలు పరిగణించొచ్చని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. "బీఎల్‌వోలు పనిభారం, ఇతర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే.. రాష్ట్ర ప్రభుత్వం పరిష్కార చర్యలు తీసుకోవచ్చు. వారి పని గంటలు తగ్గించేందుకు అదనపు సిబ్బందిని తీసుకోవడాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు. ఎస్ఐఆర్ విధుల నుంచి తమను మినహాయించాలని ఎవరైనా కోరితే.. అటువంటి కేసులను విడివిడిగా పరిశీలించి, వారి స్థానంలో మరొకరిని భర్తీ చేయొచ్చు. ఎస్ఐఆర్ కోసం అవసరమైన సిబ్బందిని కేటాయించాల్సిన బాధ్యత సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై ఉంది. అవసరమైతే వారి సంఖ్య పెంచొచ్చు" అని సుప్రీం కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

# ఇండిగో సేవల్లో తీవ్ర అంతరాయం
### పౌరవిమానయాన శాఖ సీరియస్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 3 :** దేశంలోని కీలకమైన విమానయాన సంస్థ ఇండిగో సేవల్లో తీవ్ర అంతరాయం కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా రెండురోజుల్లో 300 విమాన సర్వీసులు రద్దవడం పరిస్థితి తీవ్రతను వెల్లడిచేస్తోంది. దాంతో భారీ సంఖ్యలో ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో చిక్కుకుపోతున్నారు. గమ్యస్థానాలకు ఎప్పుడు చేరతామో స్పష్టత లేక అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో పౌరవిమానయాన శాఖ రంగంలోకి దిగిందని సమాచారం. పైలట్ రోస్టరింగ్, షెడ్యూలింగ్‌లో తీవ్ర నిర్వహణ లోపం ఉందని అసహనం వ్యక్తంచేసింది. వృత్తి ప్రమాణాలకు విరుద్ధంగా పనిచేస్తోందని ఆగ్రహం వక్తంచేసింది. అదే సంక్షోభానికి దారితీసిందని మంత్రిత్వ శాఖ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కాగా.. ఈ అంతరాయాలకు పైలట్ల కొరతే ప్రధాన కారణమని పౌర విమానాల నియంత్రణ సంస్థ డీజీసీఏ వెల్లడించింది. కొనసాగుతున్న రద్దీలను పరిశీలిస్తున్నామని, సమస్యను పరిష్కరించేందుకు ఇండిగోతో కలిసి పనిచేస్తున్నామని పేర్కొంది. దీనిపై విచారణ జరుపుతామని వెల్లడించింది. కాగా.. కొందరు పైలట్లు డ్యూటీ రోస్టర్స్ (షిఫ్ట్ టైమ్)ను పాటించకుండా.. ఇతర విమానయాన సంస్థల్లో ఇంటర్వ్యూలకు హాజరవుతున్నారని మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ కారణాలు నిర్వహణ సమస్యలకు దారితీస్తున్నా యని వెల్లడించాయి.

## వాయు కాలుష్యంతో
# పిల్లలు చనిపోతున్నారు
### కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా ఆందోళన



**న్యూఢిల్లీ, డిసెంబర్ 3 :** దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకి క్షీణిస్తుంది. దీనిపై తాజాగా కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ ఆందోళన వ్యక్తంచేశారు. వాయు కాలుష్యం అరికట్టేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీలో వాయు కాలుష్యంపై గురువారం ప్రతిపక్షాలు పార్లమెంటు ఆవం-ణలో నిరసనలు తెలిపాయి. మా స్కులు ధరించి ప్రధాని ప్రకటనలు చేయడం ఆపి.. చర్యలు చేపట్టడంపై దృష్టి పెట్టాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సమస్యపై పార్లమెంటులో చర్చ జరగాలని డిమాండ్ చేస్తూ.. నినాదాలు చేశారు. ఇందులో సోనియాగాంధీతో పాటు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. అనంతరం సోనియా విలేకరులతో మాట్లాడుతూ.. వాయు కాలుష్యంతో పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వృద్ధులు అవస్థలు పడుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చ జరగాలని.. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు. 'ఎలాంటి వాతావరణాన్ని ఆస్వాదించాలి. బయట కాలుష్య పరిస్థితులు చూడండి. సోనియాగాంధీ చెప్పినట్లు పిల్లలు ఊపిరి పీల్చుకోలేకపోతున్నారు. అనేకమంది వృద్ధులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడుతున్నారు. ఏటా ఈ పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఈ ప్రభుత్వం ప్రకటనలు చేయడం తప్ప, చర్యలు తీసుకోదు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలి. ఇది రాజకీయ సమస్య కాదు. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు' అని అన్నారు. పార్లమెంటులో శీతాకాల సమావేశాలు జరుగుతున్న తరుణంలో.. వాయుకాలుష్యంపై చర్చ జరపాలంటూ కాంగ్రెస్ ఎంపీలు కొందరు నోటీసులు జారీ చేశారు. ఇందులో పార్టీ ఎంపీ మాణికం ఠాగూర్ మాట్లాడుతూ.. వాయు కాలుష్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా సలహాలు ఇస్తోందని మండిపడ్డారు. కాలుష్యం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై విమర్శలు గుప్పించారు.

# రూపాయి
# మరింత పతనం
### రూ.90.36 వద్ద ప్రారంభమై, 90.43కు చేరిక
### అంతర్జాతీయ పరిణామాల ప్రభావం



**ముంబై, డిసెంబర్ 3 :** అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి పతనం కొనసాగుతూనే ఉంది. భారత్-అమెరికా డీల్‌పై అనిశ్చితులు, విదేశీ పెట్టుబడులు తరలిపోవడం వంటి కారణాలతో రూపాయి మారకం విలువ నానాటికీ క్షీణిస్తోంది. గురువారం నాటి ట్రేడింగ్‌లో ఒక దశలో డాలర్‌తో పోలిస్తే మన కరెన్సీ విలువ ఏకంగా 28 పైసలు పడిపోయి 90.43 వద్ద సరికొత్త జీవనకాల కనిష్ఠానికి పడిపోయింది. క్రితం సెషన్‌లో రూపాయి విలువ 90.15 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఈ క్షీణత మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందని, రూపాయి విలువ 90.70-91 మార్క్‌ను తాకనుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొన్ని నెలలుగా భారత ఈక్విటీ, డెట్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటంతో, డాలర్లకు గిరాకీ పెరిగి రూపాయి విలువపై ఒత్తిడిని పెంచుతోంది. వస్తువులకు చెల్లింపులు చేసేందుకు దిగుమతిదారులు భారీగా డాలర్లను కొనుగోలు చేస్తుండటమూ రూపాయి విలువపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. మరోవైపు, నేటి ట్రేడింగ్‌లో స్టాక్‌మార్కెట్ సూచీలు ఒడుదొడుకులకు లోనవుతున్నాయి. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాలు శుక్రవారం వెలువడనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు.

# విదేశాల నుంచి ఎన్నారైల నగదు బదిలీలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 3 :** రూపాయి ధర పడిపోవడంతో గల్ఫ్ నుంచి ఎన్నారైలు స్వదేశానికి భారీగా డబ్బులు పంపిస్తున్నారు. ఒక దిర్హామ్‌తో పోలిస్తే భారత కరెన్సీ విలువ ప్రస్తుతం 24.5 రూపాయలుగా ఉంది. కొన్ని రోజులుగా అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి పతనం కొనసాగుతోన్న నేపథ్యంలో దిర్హామ్‌లను మార్చుకున్నప్పుడు తమకు సాధారణం కంటే ఎక్కువ ఇండియన్ కరెన్సీ లభిస్తుందని యూఏఈలో నివసిస్తోన్న భారతీయులు చెబుతున్నారని ఓ మీడియా కథనం పేర్కొంది. దీంతో అక్కడ పనిచేస్తున్న భారతీయులు తమ దేశంలో ఉన్న కుటుంబాలకు డబ్బులు బదలాయింపు చేస్తున్నారు. ఈ క్రమంలో గల్ఫ్ దేశం యూఏఈ నుంచి నగదు ప్రవాహం భారీగా పెరిగింది. రూపాయి పతనం వేళ అక్కడ ఉన్న భారతీయుల నుంచి రెమిటెన్స్‌లు మూడు రెట్లు పెరిగినట్లు ఖలీజ్ టైమ్స్ కథనం వెల్లడించింది. యూఏఈ దిర్హామ్‌తో పోలిస్తే రూపాయి పడిపోతుండటంతో స్వదేశానికి డబ్బు పంపించడానికి ఇదే సరైన సమయమని ఎన్ఆర్ఐలు భావిస్తున్నారని పేర్కొంది. దాంతో ఈ అవకాశాన్ని వదులుకోకూడదని భావిస్తున్న భారతీయులు కొందరు ఎక్కువ మొత్తంలో నగదును స్వదేశానికి పంపిస్తున్నారని వెల్లడించింది. ఇదిలా ఉంటే.. భారత్-అమెరికా డీల్‌పై అనిశ్చితులు, విదేశీ పెట్టుబడులు తరలిపోవడం వంటి కారణాలతో రూపాయి మారకం విలువ నానాటికీ క్షీణిస్తోంది. నేటి ట్రేడింగ్‌లో ఒక దశలో మన కరెన్సీ విలువ ఏకంగా 28 పైసలు పడిపోయి 90.43 వద్ద సరికొత్త జీవనకాల కనిష్ఠానికి పడిపోయింది. ఈ క్షీణత మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగే అవకాశం ఉందని, రూపాయి విలువ 90.70-91 మార్క్‌ను తాకనుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొన్ని నెలలుగా భారత ఈక్విటీ, డెట్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటంతో, డాలర్లకు గిరాకీ పెరిగి రూపాయి విలువపై ఒత్తిడిని పెంచుతోంది. వస్తువులకు చెల్లింపులు చేసేందుకు దిగుమతిదారులు భారీగా డాలర్లను కొనుగోలు చేస్తుండటం రూపాయి విలువపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది.

# కేరళలో భారీగా ఎక్సైజ్ తనిఖీలు

- రూ.72 లక్షల నగదు పట్టివేత
- ఏపీకి చెందిన ఇద్దరు వ్యక్తుల అరెస్ట్


**తిరువనంతపురం, డిసెంబర్ 3 :** కొట్టాయంలో అంతర్రాష్ట్ర బస్సులో లెక్కల్లో చూపని సుమారు రూ.72 లక్షల నగదును ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏపీ, కేరళ మధ్య నడిచే అంతరాష్ట్ర బస్సులో ఈ డబ్బును గుర్తించారు. వీటిని తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, కేరళలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సందర్భంగా మాదకద్రవ్యాల, నల్లధనం అక్రమ రవాణ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడానికి రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీలు ప్రారంభించారు. కొట్టాయంలోని కురవిలంగాడ్‌లో జరిగిన తనిఖీలలో, అధికారులు బస్సులోని ఒక బ్యాగ్‌లో దాచిన నగదు కట్టలను కనుగొన్నారు. మరింత అనుమానం రావడంతో ఇద్దరు ప్రయాణికులను తనిఖీ చేయగా, వారి వద్ద మరింత నగదు ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న మొత్తం రూ.72 లక్షలు ఉందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను ఏపీకి చెందిన షేక్ జాఫర్ (59), షాషాస్‌గా గుర్తించారు. డబ్బుకు సంబంధించి ఎలాంటి పత్రాలను ఇద్దరూ సమర్పించలేక పోయారు. ఇద్దరు అనుమానితులను తదుపరి దర్యాప్తు కోసం ఆదాయపు పన్ను శాఖకు అప్పగించారు. భారీగా పట్టుబడిన ఈ నగదు వెనుక హవాలా రాకెట్ ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుల ఫోన్‌లను కూడా జప్తు చేశారు. నిధులను ఉగ్రవాద కార్యకలాపాల వినియోగం కోసం తరలిస్తున్నారా? లేదా వేరే దేని కోసమా? అని తెలుసుకోవడానికి సైబర్ ఫోరెన్సిక్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులకు పట్టుబడకుండా ఉండేందుకు స్మగ్లర్లు అంతర్రాష్ట్ర బస్సులను ఎక్కువగా వినియోగిస్తుంటారు. చిన్న ప్రైవేట్ వాహనాల మాదిరిగా కాకుండా, బస్సులను తనిఖీల కోసం చాలా అరుదుగా ఆపివేస్తారు. ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతుందని చాలా అరుదుగా మాత్రమే బస్సులను తనిఖీ చేస్తుంటారు. ఈ అవకాశాన్ని కొన్ని ముఠాలు అక్రమాల కోసం వాడుకుంటున్నాయి.

# సుప్రీంలో రాహుల్ గాంధీకి ఊరట

- భారత ఆర్మీపై అనుచిత వ్యాఖ్యల కేసు
- ట్రయల్ కోర్టు చర్యలను నిలిపివేసిన సుప్రీం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 3 :** భారత ఆర్మీపై అనుచిత వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ఉపశమనం లభించింది. రాహుల్‌గాంధీపై ట్రయల్ కోర్టు చర్యలను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు గురువారం మధ్యంతర ఉత్తర్వులను 2026, ఏప్రిల్ 22 వరకు పొడిగించింది. రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ సతీష్ చంద్రలతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించింది. ఈ అంశాన్ని వివరంగా విచారిస్తామని తెలిపింది. 2022లో చేపట్టిన భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీ భారత సైన్యంపై అవమానకరమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై ఫిర్యాదుదారు ఉదరు శంకర్ శ్రీవాస్తవ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ట్రయల్ కోర్టు సమన్లు జారీ చేయడాన్ని సవాలు చేస్తూ రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు మే 29న కొట్టివేసింది. దీంతో ఈ ఉత్తర్వులపై రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది ఆగస్టు 4న రాహుల్ గాంధీ పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు ధర్మాసనం.. తదుపరి విచారణ తేదీ వరకు స్టే విధించింది.



## అంతరిక్షం నుంచి దేదీప్యమానంగా వెలుగులీనుతున్న మక్కాలోని పవిత్ర కాబా

**సౌదీ అరేబియా :** సౌదీ అరేబియాలోని పవిత్ర మక్కా నగర అంతరిక్ష చిత్రం ఆకర్షిస్తోంది. ఆ ఫొటోలో ప్రముఖ ఆరాధానాలయం కాబా గృహం దేదీప్యమానంగా వెలుగుతోంది. వ్యోమగామి డాన్ పెటిట్.. ఐఎస్ఎస్ యాత్ర సందర్భంగా దానిని తీశారు. హై రిజల్యూషన్ నికాన్ కెమెరాతో తీసిన ఆ దృశ్యం ఇప్పుడు వైరల్‌గా మారింది. "అంతరిక్షం నుంచి సౌదీ అరేబియాలోని మక్కా నగర దృశ్యమిది. మధ్యలో వెలుగులీనుతున్నది పవిత్ర కాబా గృహం. అది స్పేస్ నుంచి కూడా కనిపిస్తోంది" అని పెటిట్ రాసుకొచ్చారు. ఇలా కళాత్మక చిత్రాలను క్లిక్‌మనిపించడంలో పెటిట్ దిట్ట. భూమికి దాదాపు 400 కిలోమీటర్ల ఎత్తున ప్రయాణించే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి ఉండే కుపోలా విండో నుంచి దీనిని చిత్రించారు. వ్యోమగాములు అక్కడికి చేరుకొన్నప్పుడు పుడమి, విశ్వం సౌందర్యాన్ని చూసి మైమరిచిపోతారు. కుపోలా.. అంటే ఇటాలియన్ భాషలో డోము అని అర్థం.

## 5000 మంది.. 40 నిమిషాల
# 'ఆత్మాహుతి' శిక్షణ

- విస్తరిస్తున్న జైషే మహిళా బ్రిగేడ్
- జోరుగా మహిళల రిక్రూట్‌మెంట్
- 500లకే గంటపాటు శిక్షణ




**ఇస్లామాబాద్, డిసెంబర్ 4 :** ఎర్రకోట పేలుడు ఘటనతో జైషే మహిళా విభాగం కుట్రలు తెర పైకి వచ్చాయి. ఈ పేలుడు కుట్రలో కీలక భాగస్వామి అయిన డా. షాహీన్ షాహిద్ జైషే మహమ్మద్ మహిళా విభాగం 'జమాత్ ఉల్ మొమినాత్' సభ్యురాలని దర్యాప్తు వర్గాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ బ్రిగేడ్‌కు సంబంధించి మరిన్ని కీలక విషయాలు బయటికొచ్చాయి. ఇప్పటివరకు ఈ విభాగంలో 5000 మందికి పైగా చేరినట్లు తెలిసింది. దీనిపై జైషే చీఫ్ మసూద్ అజార్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినట్లు తెలుస్తోంది. అక్టోబరు 8 నుంచి జైషే ప్రధాన కార్యాలయంలో ఈ బ్రిగేడ్ కోసం నియామకాలు ప్రారంభించినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఇందులోభాగంగా పాకిస్థాన్‌లోని బహవల్ పూర్, ముల్తాన్, సియాల్‌కోట్, కరాచీ, కొట్లీ, ముజఫరాబాద్ ప్రాంతాల నుంచి మహిళలను నియమించుకున్నట్లు తెలిపాయి. వీరికి ప్రతిరోజూ 40 నిమిషాల పాటు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నారట. ఐసిస్, హమాస్, ఎల్‌టీటీఈ తరహాలో మహిళలతో ఆత్మాహుతి దాడులకు సిద్ధమయ్యేలా వీరిని ప్రేరేపిస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇందుకోసం ఒక్కో మహిళ నుంచి రూ.500 చొప్పున విరాళాల కింద సేకరిస్తున్నట్లు సమాచారం. జైషేలో పురుష ఉగ్రవాదుల తరహాలోనే వీరికి కూడా కఠిన శిక్షణ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక, ఈ బ్రిగేడ్‌లో చేరేవారికి రూల్స్ కూడా కఠినంగా ఉన్నాయట. భర్త లేదా కుటుంబ సభ్యుడు మినహా తెలియని ఏ పురుషుడితోనూ మాట్లాడొద్దని వీరికి ఆంక్షలు పెట్టినట్లు సమాచారం. ఈ మహిళా విభాగానికి మసూద్ సోదరి సాదియా అజార్ నాయకురాలు. ఇక, ఆన్‌లైన్ క్లాసులకు అఫీరా బీబీ నేతృత్వం వహిస్తున్నట్లు సమాచారం. ఈమె పుల్వామా ఉగ్రదాడుల సూత్రధారి ఉమర్ ఫరూఖ్ భార్య. జైషేలో టాప్ కమాండర్ అయిన ఉమర్.. 2019 మార్చిలో కశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. ఆపరేషన్ సిందూర్ సమయంలో బహవల్‌పూర్‌లోని జైషే ప్రధాన కేంద్రంపై భారత్ బాంబులు జారవిడిచిన సంగతి తెలిసిందే. ఆ దాడుల్లో మసూద్ అజార్ కుటుంబానికి చెందిన 10 మంది మృతి చెందారు. మృతుల్లో మసూద్ బావ, సాదియా భర్త యూసఫ్ అజార్ కూడా ఉన్నాడు. ఈ ఊహించని దెబ్బ నుంచి కోలుకునేందుకు ప్రయత్నిస్తోన్న అజార్ ముఠా.. కొత్త పన్నాగాలకు తెరతీసింది. ఈ క్రమంలోనే మహిళా బ్రిగేడ్‌ను ఏర్పాటు చేసింది.

# లాభాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఎట్టకేలకు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు, ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలకు కలిసొచ్చింది. ఈ క్రమంలో నాలుగు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు శుక్రవారం వెలువడనున్న వేళ మదుపర్లు అప్రమత్తత మాత్రం కొనసాగింది. దీంతో సూచీలు ఓ మోస్తరు శ్రేణిలోనే కదలాడాయి. సెన్సెక్స్ ఉదయం 84,987.56 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,106.81) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84,949.98- 85,487.21 మధ్య కదలాడింది. చివరికి 158.51 పాయింట్ల లాభంతో 85,265.32 వద్ద ముగిసింది. నిఫ్టీ 47.75 పాయింట్ల లాభంతో 26,033.75 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.96గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. మారుతీ సుజుకీ, ఎటెర్నల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టైటాన్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి.



అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 62.80 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4200 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.






## 1 లక్షకు 4.41 లక్షలు..

### గోల్డ్ బాండ్స్‌పై బంపర్ రిటర్న్స్

పసిడి బాండ్లలో పెట్టుబడులు పెట్టిన వారికి పెరిగిన బంగారం ధరలు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. 8 ఏళ్ల క్రితం పసిడి బాండ్లు కొన్నవారికి రికార్డు స్థాయి లాభాలను అందిస్తున్నాయి. ఇటీవల కాలంలో రిడెంప్షన్‌కు వచ్చిన అన్ని బాండ్లదీ ఇదే పరిస్థితి. తాజాగా 2017 డిసెంబర్ 4వ తేదీన జారీ చేసిన 2017-18 సిరీస్-కు సంబంధించిన తుది రిడెంప్షన్ ధరను ఆర్‌బీఐ తాజాగా ప్రకటించింది. దీంతో అప్పట్లో వీటిలో మదుపు చేసిన వారికి 341 శాతం ప్రతిఫలం రావడం గమనార్హం.

2017-18 సిరీస్-ని 2017 నవంబర్ 27 నుంచి 28 వరకు కొనుగోలుకు అందుబాటులో ఉంచారు. డిసెంబర్ 4ను సెటిల్‌మెంట్ తేదీగా పేర్కొన్నారు. అప్పట్లో గ్రాము బంగారం ధరను రూ.2,961గా నిర్ణయించారు. ఈ బాండ్ల కాలపరిమితి 8 ఏళ్లు కావడంతో తాజాగా మెచ్యూరిటీకి వచ్చాయి. డిసెంబర్ 4ను రిడెంప్షన్ తేదీగా ఆర్‌బీఐ పేర్కొంటూ.. 999 స్వచ్ఛత కలిగిన బంగారం గ్రాము ధరను రూ.12,820గా నిర్ణయించింది. ఈ మొత్తం నుంచి కొనుగోలు ధరను మినహాయిస్తే ఒక్కో గ్రాముపై రూ.9,901 ప్రతిఫలం వచ్చింది. దీన్ని శాతాల్లో లెక్కిస్తే 341 శాతం అవుతుంది. అంటే అప్పట్లో రూ.1లక్ష పెట్టుబడిగా పెట్టిన వారి పెట్టుబడి రూ.4.41 లక్షలు అవుతుంది. దీనికి ఏటా చెల్లించే 2.5 శాతం వడ్డీ అదనం. అంటే ఈ మొత్తం ఇంకా ఎక్కువనే చెప్పాలి. దేశంలో భౌతిక బంగారం కొనుగోళ్లను తగ్గించాలన్న ఉద్దేశంతో 2015 నవంబర్‌లో కేంద్రం ఈ పథకం తీసుకొచ్చింది. వీటి కాలపరిమితి 8 ఏళ్లు. గ్రాము ధర నిర్ణయించేందుకు రిడెంప్షన్‌కు ముందు వారం చివరి మూడు రోజుల ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ లిమిటెడ్ నిర్ణయించిన సగటు ధరను పరిగణనలోకి తీసుకుంటారు. ఆ విధంగా డిసెంబర్ 1, 2, 3 తేదీల ధరలను పరిగణనలోకి తీసుకుని తాజా ధర నిర్ణయించారు. ఇటీవల బంగారం ధరలు చుక్కలు తాకుతున్న వేళ 8 ఏళ్ల క్రితం నాటి బాండ్లు రిడెంప్షన్‌కు వస్తుండడంతో మదుపర్లకు మంచి ప్రతిఫలం వస్తోంది. పైగా దీనికి ఒక్క రూపాయి పన్ను కూడా చెల్లించక్కర్లేదు. కేంద్ర ప్రభుత్వం తరఫున ఆర్‌బీఐ ఈ బాండ్లను జారీ చేస్తూ వచ్చింది. అయితే, ఖజానాకు భారం కావడంతో గోల్డ్ బాండ్లను ప్రభుత్వం ఇటీవల కాలంలో జారీని నిలిపివేసింది.

## రోహిత్ శర్మ, కోహ్లీతో గొడవ పడకండి : రవిశాస్త్రి



భారత స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ప్రస్తుతం వన్డేలు మాత్రమే ఆడుతున్నారు. 2027 ప్రపంచ కప్ వరకు ఆడాలని ఈ దిగ్గజ బ్యాటర్లు భావిస్తున్నారు. కానీ, వరల్డ్ కప్ జట్టులో వారికి చోటు ఉ ంటుం దని టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ హామీ ఇవ్వడం లేదు. కావాలనే వీరిని అణగదొక్కే ప్రయత్నం చేస్తు న్నారని భారత జట్టు యాజమా న్యంపై విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంపై టీమ్‌ఇండియా మాజీ కోచ్ రవిశాస్త్రి ఓ ఇంట ర్వ్యూలో మాట్లాడాడు. కొంతమం ది కావాలనే రోహిత్, కోహ్లీ భవిష్యత్ విషయంలో గందరగోళ పరిస్థితులను సృష్టిస్తున్నారని పేర్కొన్నాడు. రో-కో వన్డే దిగ్గజాలని, ఆ స్థాయి ఆటగాళ్లతో గొడవపడకండి అని హెచ్చరించాడు. రోహిత్, విరాట్ విషయంలో ఎవరు ఈ గందరగోళ పరిస్థితులను సృష్టిస్తున్నారని ప్రశ్నించగా.. 'చేసేవారు చేస్తున్నారు. అంతే చెప్పగలను. ఒక్కసారి కోహ్లీ, రోహిత్ ఫామ్ అందుకుంటే ఈ వ్యవహారం మొత్తానికి ఫుల్‌స్టాప్ పడుతుంది' అని రవిశాస్త్రి పేర్కొన్నాడు. సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్, టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్‌ను ఉద్దేశించి రవిశాస్త్రి ఈ వ్యాఖ్యలు చేశాడని అర్థమవుతోందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడు తున్నారు. ప్రస్తుతం రోహిత్, కోహ్లీ మంచి ఫామ్‌లో ఉన్నారు. సౌతాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో విరాట్ వరుసగా రెండు సెంచరీలు చేశాడు. రోహిత్ శర్మ అర్ధ శతకం సాధించాడు.

## రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ భవిష్యత్తును నిర్ణయించేది అలాంటివారా?

### మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్



భారత జట్టు స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ భవిష్యత్తును.. తమ కెరీర్లో పెద్దగా సాధించని వారు నిర్ణయిస్తుండటం దురదృష్టకరమని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ అన్నాడు. రోహిత్, కోహ్లీ ఇప్పటికే టీ20, టెస్ట్ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. ప్రస్తుతం వారు కేవలం వన్డే క్రికెట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు. వన్డే వరల్డ్‌కప్ 2027లో పాల్గొనడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. అయితే వారు వరల్డ్ కప్ ఆడబోయే టీమ్‌లో ఉంటారా.. అనే విషయంలో సెలక్టర్ల కోణం నుంచి సందిగ్ధత నెలకొంది. ఈ విషయమై ఐఎల్‌టీ20 సీజన్ 4 సందర్భంగా జరిగిన చర్చలో హర్భజన్ సింగ్ స్పందించాడు. 'ఇది మన అవగాహనకు మించినది. స్వయంగా ఆటగాడిని కాబట్టి నేను సమాధానం చెప్పలేకపోవచ్చు. నా విషయంలోనూ ఇలాగే జరిగింది. నా సహచరుల్లోనూ చాలా మందికీ జరిగింది. కానీ ఇది చాలా దురదృష్టకరం. అయినా మేం దాని గురించి మాట్లాడం, చర్చ కూడా జరపం' అని హర్భజన్ సింగ్ అన్నాడు. 'విరాట్ కోహ్లీ ఇప్పటికీ చక్కగా ఆడుతున్నాడు. ఈ విషయంలో సంతోషంగా ఉన్నాను. అయితే తమతమ కెరీర్లో పెద్దగా సాధించని వ్యక్తులు కూడా.. వారి (రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ) భవిష్యత్తును నిర్ణయిస్తుండటం దురదృష్టకరం' అని హర్భజన్ సింగ్ కుండబద్దలు కొట్టినట్లుగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. 'రోహిత్, విరాట్ ఎప్పటికీ గొప్ప ఆటగాళ్లే. వారు జట్టు కోసం బ్యాటర్లుగా, సారథులుగా ఎంతో చేశారు. వారు రోజు రోజుకూ తమ ఆటలో ఇంకా మెరుగవుతున్నారు. అంతేకాకుండా వారు తమ ఆటతీరుతో యువ క్రికెటర్లకు కూడా మార్గదర్శకులుగా నిలుస్తున్నారు. ఈ విషయంలో వారికి అభినందనలు' అని హర్భజన్ పేర్కొన్నాడు.



## ఆ కొన్ని ఓవర్లే కొంపముంచాయి

### ఇర్ఫాన్ పఠాన్



దక్షిణాఫ్రికాతో రాంచీ వన్డేలో 17 పరుగులతో గట్టెక్కిన టీమ్‌ఇండియా, రాయ్‌పుర్‌లో మాత్రం చేతులెత్తేసింది. సఫారీల ముందు 358 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించినా.. చివరికి 4 వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. కొండంత లక్ష్యాన్ని కూడా దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ నేపథ్యంలో భారత జట్టు ఓటమికి గల కారణాన్ని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ వెల్లడించాడు. 'బ్యాటింగ్ సమయంలో చివరి కొన్ని ఓవర్లే టీమ్‌ఇండియా ఓటమికి కారణమయ్యాయి' అని ఇర్ఫాన్ పఠాన్.. 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశాడు. దీనికి అభిమానుల నుంచి విశేషమైన స్పందన వచ్చింది. ఒకానొక దశలో 40 ఓవర్ల సమయానికి టీమ్‌ఇండియా స్కోర్ 284/4గా ఉంది. కానీ తర్వాత దక్షిణాఫ్రికా బౌలర్లు పుంజుకొని, భారత బ్యాటర్లను కట్టడి చేశారు. చివరి 10 ఓవర్లలో వారు కేవలం 74 పరుగులు మాత్రమే ఇచ్చారు. దీంతో టీమ్‌ఇండియా 50 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 358 పరుగులు చేసింది. మరో 30, 40 పరుగులు చేసి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అలాగే.. ఛేదనలో సఫారీలు సత్తా చాటారు. ఐడెన్ మార్‌క్రమ్ సెంచరీతో (110, 98 బంతుల్లో, 10 ఫోర్లు, 4 సిక్సులు) ఆకట్టుకున్నాడు. మ్యాథ్యూ బ్రీట్జ్కే(68, 64 బంతుల్లో, 5 ఫోర్లు), డెవాల్డ్ బ్రెవిస్ (54, 34 బంతుల్లోబీ 1 ఫోర్, 5 సిక్సులు) అర్ధశతకాలు చేశారు. కెప్టెన్ తెంబా బవుమా (46బీ 48 బంతుల్లో, 3 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీకి దగ్గరగా వచ్చాడు. చివర్లో కోర్బిన్ బోష్ (29) సమయోచిత ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో దక్షిణాఫ్రికా జట్టు రెండో వన్డేలో విజయం సాధించింది. ప్రస్తుతానికి సిరీస్‌ను 1-1తో సమం చేసింది. అయితే మైదానంలో తేమ (డ్యూ), టీమ్‌ఇండియా పేలవమైన ఫీల్డింగ్ కూడా ఓటమికి కారణమయ్యాయి. సిరీస్ విజేతను నిర్ణయించే కీలకమైన మూడో వన్డే విశాఖపట్నం వేదికగా శనివారం (డిసెంబర్ 6న) జరగనుంది.

## అభిషేక్ శర్మ విధ్వంసం..

సౌతాఫ్రికాతో టీ20 సిరీస్‌కు ముందు టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ దుమ్ములేపుతున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ-2025లో పంజాబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న అభిషేక్.. గురువారం పుదుచ్చేరితో జరిగిన మ్యాచ్‌లో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. తాను ఎదుర్కొన్న తొలి బంతి నుంచే ప్రత్యర్థి బౌలర్లను శర్మ ఉతికారేశాడు. ఉప్పల్ మైదానంలో అభిషేక్ క్రీజులో ఉన్నంత సేపు బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 9 బంతుల్లోనే 4 ఫోర్లు, 3 సిక్సలతో 34 పరుగులు చేశాడు. అతడితో పాటు సలీల్ అరోరా(44), రమణ్‌దీప్ సింగ్(34), శన్వీర్ సింగ్(38) కీలక నాక్స్ ఆడారు. ఫలితంగా పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. పుదుచ్చేరి బౌలర్లలో రాజా రెండు, అయూబ్ తండా, జయంత్ యాదవ్ ఒక్క వికెట్ సాధించారు. అనంతరం లక్ష్య ఛేధనలో పుదుచ్చేరి 18.4 ఓవర్లలో 138 పరుగులకు ఆలౌటైంది. సైదక్ సింగ్(61) ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. మిగితా బ్యాటర్లందరూ విఫలమయ్యారు. అభిషేక్ శర్మ బౌలింగ్‌లో కూడా మూడు వికెట్లతో సత్తాచాటాడు. అతడితో పాటు అయూష్ గోయల్ మూడు, హర్‌ప్రీత్ బ్రార్ రెండు వికెట్లు సాధించారు. కాగా ఈ టోర్నీలో బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ కేవలం 52 బంతుల్లోనే 148 పరుగులు చేసి వరల్డ్ రికార్డు సృష్టించాడు. సౌతాఫ్రికాతో టీ20 సిరీస్ నేపథ్యంలో పంజాబ్ జట్టు నుంచి అభిషేక్ వైదొలిగే అవకాశముంది. టీ20 సిరీస్ డిసెంబర్ 9 నుంచి ప్రారంభం కానుంది.



## ఆర్సీబీని కొనుగోలు చేయడానికి అమెరికా బిలియనీర్ ఆసక్తి!

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు యజమాని అయిన డియాజియో కంపెనీ ఈ ఫ్రాంఛైజీ విక్రయ ప్రక్రియను ఇటీవల ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమాచారం ఇచ్చింది. ఆర్సీబీ ఫ్రాంఛైజీలో పెట్టుబడి పెట్టే వారి కోసం చూస్తున్నట్లు, వచ్చే ఏడాది మార్చి 31 నాటికి ఈ ప్రక్రియ పూర్తికానున్నట్లు ఆ సంస్థ తెలిపింది. భారత్‌తోపాటు కొన్ని విదేశీ సంస్థలు ఆర్సీబీని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. తాజాగా హండ్రెడ్ లీగ్‌లోని వెల్ష్ ఫైర్ ఫ్రాంఛైజీ యజమానులు బెంగళూరు టీమ్‌ను కొనుగోలు చేయాలనుకుంటున్నారని సమాచారం. అమెరికన్ టెక్ బిలియనీర్ సంజయ్ గోవిల్, గ్లామోర్గాన్ క్రికెట్ క్లబ్ వెల్ష్ ఫైర్‌కు యజమానులుగా ఉన్నారు. అమెరికా మేజర్ లీగ్ క్రికెట్ లీగ్‌లోని వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టుకు కూడా సంజయ్ గోవిల్ యజమాని. 'మేం (సంజయ్ గోవిల్, గ్లామోర్గాన్ (క్రికెట్ క్లబ్) ప్రత్యేకంగా ఏ ఫ్రాంఛైజీ గురించి మాట్లాడలేదు. అయితే, మేం ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ఫ్రాంఛైజీలను సొంతం చేసుకోవడం, నిర్వహించడం, అభివృద్ధి చేయడం వంటి వ్యాపారంలో ఉన్నాం. మా వాటాదారులకు విలువను సృష్టిస్తూ ఆ ప్రక్రియలో పూర్తిగా పాల్గొనాలను కుంటున్నాం' అని గ్లామోర్గాన్ ఛైర్మన్ మార్క్ రైడ్‌డెర్చ్ రోబర్ట్స్ ఓ ఆంగ్ల పత్రికతో అన్నారు. ఇటీవల వచ్చిన నివేదికల ప్రకారం ఆర్సీబీ విలువ దాదాపు రెండు బిలియన్ డాలర్లుగా ఉంది.



## టోల్‌ప్లాజాల వద్ద ఇక ఆగక్కర్లేదు..

### ఏడాదిలో కొత్త విధానం

**న్యూఢిల్లీ :** జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి గుడ్‌న్యూస్. టోల్‌ప్లాజాల వద్ద ఇకపై ఒక్క క్షణం కూడా ఆగాల్సిన అవసరం లేదు. దీనికి సంబంధించిన కొత్త ఎలక్ట్రానిక్ సిస్టమ్ త్వరలో అందుబాటులోకి రానుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. ప్రస్తుత విధానం తెర మరుగై.. ఏడాదిలోనే దేశవ్యాప్తంగా అమల్లోకి రానుందని తెలిపారు. ప్రస్తుతం 10 ప్రాంతాల్లో ఈ తరహా విధానాన్ని అమలుచేస్తున్నామని, దాన్ని దేశవ్యాప్తంగా విస్తరించనున్నామని తెలిపారు. ఈ మేరకు లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో దీనిపై ఆయన మాట్లాడారు. "ప్రస్తుత టోల్ వసూలులో కొత్త విధానం అందుబాటులోకి రానుంది. ఇకపై టోల్‌ప్లాజాల వద్ద ఎవరూ మిమ్మల్ని ఆపరు. దేశవ్యాప్తంగా ఏడాదిలో దీన్ని అమలుచేయనున్నాం" అని గడ్కరీ తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రూ.10 లక్షల కోట్ల విలువైన 4500 హైవే ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని చెప్పారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఇటీవల విడుదల చేసిన ఓ ప్రకటన ప్రకారం.. టోల్ ప్లాజాల వద్ద ఫీజు వసూలు చేసేందుకు నేషనల్ ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ కార్యక్రమాన్ని ఎన్‌పీసీఐ తీసుకొచ్చింది. ఇది కూడా ఫాస్టాగ్ ద్వారానే పని చేస్తుంది. టోల్‌ప్లాజా మీదుగా వెళ్లినప్పుడు వాహనం ఆపాల్సిన అవసరం లేకుండానే యూజర్ బ్యాంక్ అకౌంట్ నుంచి ఫీజు ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది.



## అమెరికాకు స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు 3 రెట్లు

అమెరికాకు మనదేశం నుంచి స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు మూడింతలయ్యాయి. ఈ ఏడాది అక్టోబరులో 1.47 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.13,230 కోట్ల) విలువైన ఫోను ఎగుమతి అయ్యాయని, 2024 అక్టోబరులో ఇవి 0.46 బి. డాలర్లు (రూ.4140 కోట్లు) అని ప్రభుత్వ గణాంకాలు తెలిపాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబరులో అమెరికాకు 10.78 బి.డా. (సుమారు రూ.97,000 కోట్ల) స్మార్ట్‌ఫోన్లను ఎగుమతి చేశాం. 2024 ఇదే సమయంలో వీటి విలువ 3.6 బి. డాలర్లే (సుమారు రూ.32,400 కోట్లే). మనదేశంలో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు అమలవ్వడం, వెండార్లతో అనుబంధం, అంతర్జాతీయ స్మార్ట్‌ఫోన్ దిగ్గజాల పెట్టుబడులు కొనసాగడం వంటి కారణాలతో ఎగుమతుల్లో సానుకూల వృద్ధి సాధించగలిగామని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ప్రపంచవ్యాప్తంగా భారత స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు 2025 ఏప్రిల్-అక్టోబరులో 15.95 బి. డాలర్ల (దాదాపు రూ.1.41 లక్షల కోట్ల)కు చేరుకున్నాయి. 2024 ఇదే సమయంలోని 10.68 బి. డాలర్ల (సుమారు రూ.95,000 కోట్ల)తో పోలిస్తే ఇవి 49.35% అధికం.

# బాహుబలి కోసం జపాన్‌కు ప్రభాస్

## స్పిరిట్ షూట్‌కు తాత్కాలిక బ్రేక్




గ్లోబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడు. ముందుగా ప్రకటించిన ప్రకారం జపాన్‌లో బాహుబలి : ది ఎపిక్ స్పెషల్ ప్రీమియర్‌కు హాజరు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభాస్ గురువారం జపాన్‌కు వెళ్లాడు. ఈవెంట్‌కు బాహుబలి ప్రాంచైజీ నిర్మాత శోభు యార్లగడ్డ కూడా హాజరు కానున్నారు. బాహుబలి : ది ఎపిక్ జపాన్‌లో డిసెంబర్ 12న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మేరకు మేకర్స్ డిసెంబర్ 5, 6వ తేదీల్లో స్పెషల్ ప్రీమియర్స్ ఏర్పాటు చేశారు. ప్రభాస్ కల్కి 2898 ఏడీ ప్రమోషన్స్ టైంలో జపాన్‌లో తాను కలవలేకపోయిన అభిమానులను కలుస్తానని హామీనిచ్చాడని తెలిసిందే. వారికిచ్చిన మాట ప్రకారం జపాన్‌లో అభిమానులతో చిట్‌చాట్ చేయనున్నాడు. ఇదిలా ఉంటే యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ఇప్పటికే షూటింగ్ మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ప్రభాస్, తృప్తి డిమ్రిపై వచ్చే కొన్ని సన్నివేశాలను కూడా ఇటీవలే షూట్ చేశారు. షూటింగ్ నుంచి చిన్న బ్రేక్ తీసుకున్న ప్రభాస్ జపాన్ టూర్ అయిపోగానే మళ్లీ స్పిరిట్ షూట్‌తో బిజీగా కానున్నాడు. టాలీవుడ్ డైరెక్టర్ మారుతి-ప్రభాస్ కాంబోలో రాజాసాబ్ వస్తుందని తెలిసిందే. హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోన్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా 2026 జనవరి 9న విడుదల చేయనున్నారు. ఇప్పటికే ప్రమోషన్స్‌లో భాగంగా లాంచ్ చేసిన పోస్టర్లు, టీజర్లు, ట్రైలర్స్‌కు మంచి స్పందన వస్తోంది.



# చిత్రపరిశ్రమలో ఒడుదొడుకులు సహజం

## నటి రకుల్ ప్రీత్ సింగ్ వ్యాఖ్య

చిత్రపరిశ్రమలో ఒడుదొడుకులు సహజమని నటి రకుల్ ప్రీత్ సింగ్ అన్నారు. సినిమా అన్నాక విజయాలు, అపజయాలు..నష్టాలు, లాభాలు కూడా సహజమని అన్నారు. తన భర్త జాకీ భగ్నానీ దివాలా తీశారంటూ ఇటీవల వచ్చిన వార్తలపై ఆమె స్పందించారు. కంపెనీ మూసివేశారనే వార్తలను ఖండించారు. ఆ సమయంలో మీడియాలో వచ్చిన రూమర్స్ గురించి ప్రస్తావించారు. క్లిక్స్ కోసం ఏమైనా రాసే సంస్కృతికి అలవాటు పడ్డారు. వాస్తవానికి, ఆ వార్తలకు చాలా వ్యత్యాసం ఉంటుంది. నాకు నిజానిజాలు అన్నీ తెలుసు కాబట్టి నేను వాటిని పట్టించుకోలేదు. పరిశ్రమలో భాగమైనప్పుడు కొన్ని విషయాల గురించి మౌనంగా ఉండడమే మంచిది. సమయం వచ్చేవరకూ ప్రజలకు అసలు నిజమేమిటనేది తెలియదు. జాకీ భగ్నానీపై వార్తలు వచ్చినప్పుడు అతడు ఎన్ని సవాళ్లు ఎదుర్కొన్నాడో నేను దగ్గర నుంచి చూశాను. కంపెనీ మూసేశారని రాశారు. అతడు నిర్మాతగా వ్యవహరించిన మూడు సినిమాలు ఆదరణ సొంతం చేసుకోలేదన్నమాట వాస్తవమే. కానీ, కంపెనీ మూసివేయలేదు. ఆర్థికంగా చాలా నష్టపోయాం. ఇండస్ట్రీలోని ప్రతి నిర్మాతకు అలా జరుగుతుంది. ఒకనొక సమయంలో అమితాబ్‌బచ్చన్‌కు కూడా ఇలానే జరిగింది. ఎదుగుతున్న సమయంలో ఇదంతా ఒక దశ అని రకుల్ అన్నారు. బాలీవుడ్ నటులు అక్షయ్‌కుమార్ , టైగర్ ష్రాఫ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బడే మియా.. ఛోటే మియా'. భారీ తారాగణంతో రూపొందిన ఈ సినిమా అనుకున్న స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. దీంతో ఈ సినిమా నిర్మాత, రకుల్ ప్రీత్ సింగ్ భర్త జాకీ భగ్నానీ దివాలా తీశారంటూ గతంలో వార్తలు వచ్చాయి.



## నాగచైతన్య - శోభిత మొదటి పెళ్లి రోజు

వివాహ మొదటి వార్షికోత్సవం సందర్భంగా శోభిత ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. తాను ఎంతో ప్రేమించిన నాగచైతన్యతో ఏడడుగులు వేసి ఏడాది అయిందని తెలిపారు. నాగచైతన్య వచ్చాకే తన జీవితం పరిపూర్ణమైందన్నారు. 'శ్రీమతిగా ఏడాది' అంటూ పెళ్లి నాటిసంగతులు గుర్తుచేసుకుంటూ వీడియోను షేర్ చేశారు. నాగచైతన్య - శోభిత గతేడాది డిసెంబర్ 4న పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే.

# ఫిబ్రవరిలో విజయ్-రష్మికల పెళ్లి..!

## స్పందించిన నటి రష్మిక



నటి రష్మిక- విజయ్ దేవరకొండ ఫిబ్రవరిలో పెళ్లి చేసుకోనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఒక హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రష్మిక ఈ వార్తలపై స్పందించారు. తాను ఈ రూమర్స్‌ను ఖండించలేనని అన్నారు. “నేను ఈ వార్తలను ఇప్పుడే ధ్రువీకరించలేను. అలాగని వీటిని ఇప్పుడు ఖండించనూ లేను. పెళ్లి గురించి ఎప్పుడు, ఎక్కడ మాట్లాడాలో అప్పుడు మాట్లాడతాను. కచ్చితంగా మీ అందరితో పంచుకుంటాను. అంతకు మించిన వివరాలను ఇప్పుడే వెల్లడించలేను” అని అన్నారు. “నేను వ్యక్తిగత జీవితం గురించి బయటకు వెల్లడించడానికి ఇష్టపడను. పర్సనల్ లైఫ్‌ను చాలా సీరియస్‌గా తీసుకుంటాను. ఇంట్లో ఉన్నప్పుడు వర్క్ గురించి మాట్లాడను. బయటకు వచ్చినప్పుడు పర్సనల్ వర్క్ గురించి మాట్లాడను. ప్రతి పనికి ప్రణాళికలు వేసుకుంటాను. ఇక సినిమాల విషయానికి వస్తే.. ఒక్కోసారి అనుకున్నట్లు జరగదు. కొన్ని కారణాల వల్ల ఉన్నట్టుండి షూటింగ్ వాయిదా పడుతుంది. మీటింగ్స్, రిహార్సల్స్ కారణంగా ఒక్కోసారి షూట్ ఆలస్యం అవుతుంది. నేను డబుల్ షిఫ్ట్‌లు చేసిన రోజులు ఎన్నో ఉన్నాయి. నటీనటులు ఎప్పుడూ పనిలో నిమగ్నమై ఉండాలి. నరుటో కార్టూన్ అంటే నాకు ఎంతో ఇష్టం. దాని చూస్తూ విశ్రాంతి పొందుతాను” అని రష్మిక చెప్పారు. ఇక అదే ఇంటర్వ్యూలో రష్మిక తన కెరీర్ గురించి, వరుస విజయాల గురించి మాట్లాడారు. “ఈ ఏడాది నాకు ఎంతో ప్రత్యేకమైనది ఐదు సినిమాలు విడుదలై ఆదరణ సొంతం చేసుకున్నాయి. ఇండస్ట్రీలో ఈ స్థానానికి రావాలంటే ఎంతో కష్టపడాలి. విజయం ఒక్కసారిగా రాదు. నేను ఎలాంటి కథలలోనైనా నటించగలనని ప్రేక్షకులకు తెలియడానికి కొంత సమయం పట్టింది. ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలోనే కొన్ని నిర్ణయాలు తీసుకున్నాను. భాషాపరమైన, జానర్‌లకు సంబంధించిన ఎలాంటి హద్దులు లేకుండా అన్నిరకాల సినిమాల్లో నటించాలని నిర్ణయించుకున్నా. ఈ ఏడాదిలో చేసిన ఐదు సినిమాల్లో అన్నీ భిన్నమైన పాత్రలే. అవి చూశాక ప్రేక్షకులు ప్రశంసలు కురిపిస్తుంటే ఆనందంగా ఉంది” అని అన్నారు.

# మనశంకరవరప్రసాద్ నుంచి మరో పాట

## 8న విడుదలకు చిత్రబృందం సన్నాహాలు

అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'మన శంకరవర ప్రసాద్' చిత్రం నుంచి తాజాగా రెండో పాట విడుదల తేదీ ఖరారైంది. ఇప్పటికే విడుదలైన మొదటి పాట 'మీసాల పిల్ల' భారీ విజయాన్ని సాధించి ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్న నేపథ్యంలో చిత్ర బృందం తదుపరి పాట అప్‌డేట్‌తో అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. 'శశిరేఖ' అనే పేరుతో రాబోతున్న ఈ రెండో పాట డిసెంబర్ 8న విడుదల కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ పాటకు సంబంధించిన ప్రోమో డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తుండగా.. మెగాస్టార్ చిరంజీవితో పాటు విక్టరీ వెంకటేశ్, నయనతార, కేథరిన్ థ్రెసా వంటి అగ్ర తారలు నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సాహు గారపాటి, సుష్మిత కొణిదెల, వి. హరికృష్ణ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.




# అఖండ ప్రీమియర్ షో క్యాన్సిల్

## యథావిధిగా నేడు సినిమా విడుదల



**హైదరాబాద్, డిసెంబర్ 4 :** అఖండ 2 ప్రీమియర్స్ కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న బాలకృష్ణ అభిమానులకు సినిమా టీమ్ షాకింగ్ న్యూస్ చెప్పింది. ఒకరోజు ముందుగానే ప్రీమియర్స్‌తో సినిమా ప్రారంభించాలని అనుకున్నారు. కానీ, చివరి నిమిషంలో టెక్నికల్ ఇష్యూస్ కారణంగా సినిమా ప్రీమియర్స్ క్యాన్సిల్ చేసినట్లుగా సినిమా టీమ్ ప్రకటించింది. 'ఈరోజు వేయాల్సిన అఖండ ప్రీమియర్స్ టెక్నికల్ ఇష్యూస్ వల్ల క్యాన్సిల్ అయ్యాయి. మేము సినిమా షో వేయడానికి చాలా ప్రయత్నించాం, కానీ కొన్ని మా చేతుల్లో లేకుండా పోయాయి. సారీ ఫర్ ది ఇన్‌కన్వీనియన్స్' అంటూ సంస్థ 14 రీల్స్ ప్లస్ అధికారిక ట్విట్టర్ ఖాతా నుంచి పోస్ట్ పెట్టింది. నిజానికి, అమెరికా సహా ఇండియాలో కూడా ప్రీమియర్స్ పెద్ద ఎత్తున ప్రదర్శించాలని ప్లాన్ చేశారు. కానీ, టెక్నికల్ ఇష్యూస్ కారణంగా ఇప్పుడు ఆ ప్రీమియర్స్ ప్రదర్శన నిలిపివేస్తున్నట్లు సినిమా టీమ్ అధికారికంగా ప్రకటించింది. అయితే ఓవర్సీస్ రివ్యూస్ మాత్రం యథావిధిగా పడనున్నాయని ప్రకటించారు. సినిమా రేపు ఉదయం యథావిధిగా రిలీజ్ అవుతుందని పేర్కొంది.

### తెలంగాణలో టికెట్ ధరల పెంపు..

తెలంగాణలో 'అఖండ2' టికెట్స్ విషయంలో నెలకొన్న సందిగ్ధత వీడింది. టికెట్ ధరల పెంపుతో పాటు, స్పెషల్ ప్రీమియర్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అఖండ2: తాండవం'. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో 'అఖండ2' టికెట్ ధరలను పెంచుకునేందుకు అనుమతి ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ స్క్రీన్‌లో రూ.50 (జీఎస్టీతో కలిపి), మల్టీ ప్లెక్స్‌లో రూ.100 (జీఎస్టీతో కలిపి) ధర పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది. డిసెంబరు 4న రాత్రి 8 గంటల షోకు కూడా అనుమతి ఇచ్చింది. ఈ టికెట్ ధరను రూ.600గా (జీఎస్టీతో కలిపి) నిర్ణయించారు. అయితే, పెంచిన ధరలు కేవలం మూడు రోజులు మాత్రమే అమల్లో ఉంటాయి. పెంచిన ధరల ద్వారా వచ్చిన ఆదాయంలో 20శాతం మూవీ ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు వెళ్లనుంది. చిత్ర పరిశ్రమలో సినీ కార్మికుల సంక్షేమం కోసం ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక బ్యాంకు ఖాతాను ఫిల్మ్ డెవలమెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) ఓపెన్ చేసింది. ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఖాతాను లేబర్ కమిషనర్ పర్యవేక్షించనున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com